ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0

ఈవీఎం గొడౌన్ తనిఖీ

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భద్రపరిచిన గొడౌన్‌ను శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్వి తనిఖీ చేశారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.


దెందులూరులో వీఆర్ఏల నిరసన

మా గోడు వినండి..

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా వీఆర్ఏలు శుక్రవారం రెండోరోజు రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్లకార్డులు ప్రదర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు కల్పించాలని, పే స్కేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాత్రిపూట నైట్ వాచ్‌మన్ విధులు తగదని, నామినీలను వీఆర్ఏ లుగా గుర్తించాలంటూ వినతి పత్రాలు అందించారు.

కలెక్టర్ దృష్టికి ప్రజా సమస్యలు

'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' అంశాలపై చర్చించిన జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ వెట్రిసెల్విని చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కోరారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ పరిధిలోని ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు, జడ్పీ పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి, గ్రామాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించింది. చైర్‌పర్సన్ పద్మశ్రీ పాల్గొని ప్రజల సమస్యలను విన్నారు. అనంతరం ఆమె కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు


కలెక్టర్ వెట్రిసెల్వితో సమావేశమైన జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

విశ్లేషించినప్పుడు ఎక్కువ భాగం సమస్య లు ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బీ, డీపీవో, డీఎంహెచ్‌వో కార్యాలయాల పరిధిలో ఉన్నట్టు గుర్తించామని వివరించారు. జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెయిటింగ్ హాల్స్ నిర్మాణానికి సంబంధించి చర్చించారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సహకారంతో త్వరలోనే ఈ నిర్మాణాలు చేపట్టి రోగులకు మరింత సౌకర్యం కల్పించనున్నట్టు జడ్పీ చైర్‌పర్సన్ వెల్లడించారు. కొన్ని నెలలుగా జీతభత్యాలు అందక ఇబ్బందులు పడుతున్న సత్యసాయి తాగునీటి పథకం సిబ్బందికి రూ.రెండు కోట్లు ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిందన్నారు. కాగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ చురుగ్గానే స్పందిస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారని జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు..
సమస్యల వెల్లువ
7


రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లేఖర్లు

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

ఏలూరు,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన దస్తావేజుల తయారీలో ఓటీపీ విధానం ఎత్తివేయాలని దస్తావేజు లేఖరులు ఏలూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద శుక్రవారం పెన్‌డౌన్ చేపట్టారు. రిజిస్ట్రేషన్లకు స్వల్పంగా విఘాతం ఏర్పడింది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ భూముల క్రయ, విక్రయాల సమయాల్లో దస్తావేజులకు సంబంధించి చిన్నపాటి తప్పులకు తమను బాధ్యులను చేయడం వల్ల తమ ఉపాధి కోల్పోతున్నామన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా సబ్ రిజిస్ట్రార్ జాయింట్-1 ఎస్.లావణ్యకు అందజేశారు. కార్యక్రమంలో గారపాటి వీరాస్వామి, యు.పాపారావు, సముద్రాల నాగరాజు, సముద్రాల దుర్గారావు, వంకాయల బుజ్జి తదితరులు పాల్గొన్నారు. నిరసనను శనివారం కూడా కొనసాగించనున్నారు. 'దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. జిల్లావ్యాప్తంగా శుక్రవారం 77 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.10 లక్షల పైబడి ఆదాయం సమకూరింది' అని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

పదకొండు స్కూల్ బస్సులపై కేసులు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బస్సులను శుక్రవారం ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్, మోటారు వాహనాల తనిఖీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘించిన 11 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.37,400లను అపరాధ రుసుం విధించారు. విద్యార్థులను తరలించే విషయంలో నిబంధనలను పాటించని విద్యా సంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాలను సీజ్ చేస్తామని డీటీసీ హెచ్చరించారు.

కోర్టు విధులు బహిష్కరణ

ఏలూరుక్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలంటూ ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదులు ఎవరైనా మరణిస్తే సంతాప సభలను కోర్టు పని గంటల్లో కాకుండా సాయంత్రం 4.30 గంటల తర్వాత నిర్వహించాలని, ఉదయం, మధ్యాహ్నం నిర్వహించడం వల్ల కోర్టు విధులకు ఆటంకం కలిగి కక్షిదారులు ఇబ్బందులకు గురవుతున్నారంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలంటూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు.

దీపావళి దుకాణాలకు లైసెన్సులు

ఏలూరు,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్టోబరు 20వ తేదీన జరిగే దీపావళి పండుగ సందర్భంగా ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో తాత్కాలికంగా ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ తెలిపారు. అక్టోబరు 12వ తేదీలోగా దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారుని ఆధార్, పాన్ కార్డు, చలానా ఒరిజినల్, జీఎస్టీ చెల్లించి రసీదును జత పరచాలన్నారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రొయ్యలు, చేపలు (ఆక్వా) రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మత్స్య, విద్యుత్ శాఖ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించగా ఆక్వా రైతులు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధిక విద్యుత్ బిల్లులు, చెరువులకు అప్రోచ్ రోడ్డుల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్స్‌పై సబ్సిడీ, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్తానని హామీ ఇచ్చారు.

చిన్నారుల ఆధార్ అప్‌డేట్..

ఏలూరు : జిల్లాలో 192 ఆధార్ సెంటర్ల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్‌ను అప్‌డేట్ చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆధార్ మోనటరింగ్ కమిటీ సమావేశం శుక్రవా రం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయాలని, 5-7 వయస్సు వారికి చేతి వేలిముద్రలు తీసుకోవాలని, 15-17 వయస్సు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలన్నారు.

వాహనమిత్ర పథకంపై టెలీ కాన్ఫరెన్స్

ఏలూరు సిటీ : వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తుల పరిశీలన ఈనెల 20వ తేదీ శనివారం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం వాహనమిత్ర దరఖాస్తులపై జడ్పీ సీఈవో శ్రీహరి, ఎంపీడీవో లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 8,429 దరఖాస్తులు అందగా 6,418 దరఖాస్తులు ఈ-కేవైసీ పూర్తయ్యాయని, మిగిలినవి శనివారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.


సగంలో నిలిచిన దెందులూరు- పంగిడిగూడెం రోడ్డు

నిధులకు.. గ్రహణం!

ఉమ్మడి జిల్లాల్లో నిలిచిన ఎనిమిది ఎన్‌డీబీ రోడ్లు

వైసీపీ జమానాలో మంజూరై నిలిచిన ఆర్అండ్‌బీ రోడ్ల కూటమి పాలనలోనైనా మోక్షం లభిస్తుందన్న ఉమ్మడి జిల్లాల ప్రజల ఆశలకు నిధులేమితో అభివృద్ధికి గ్రహణం పట్టుకుంది. తొమ్మిది నెలలు క్రితం ప్రారంభించిన ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్) రోడ్ల నిర్మాణం అతీగతీ లేకుండా ఉన్నాయి. మొత్తం 11 రోడ్లను రూ.210 కోట్లతో చేపట్టగా.. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉండడంతో పనులన్నీ నిలిపి వేశారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్లు పాడయ్యే ప్రమాదం ఏర్పడింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బకాయిలు రూ.40 కోట్లు
- సీఎం దృష్టికి జంగారెడ్డిగూడెం రోడ్డు సమస్య
- అయినా ఇప్పటికీ పురోగతి శూన్యం

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో 60 కిలో మీటర్ల మేర రహదారుల నిర్మాణానికి నిధుల లేమి ప్రధాన అడ్డంకిగా మారింది. (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు లోన్) కింద 2020లో ఈ పనులకు అప్పటి వైసీపీ ప్రభుత్వం మంజూరు చేయగా.. అప్పటి నుంచి సాగుతూ టీడీపీ హయాంలో ఈ పనులకు టెండర్లు పిలిచారు. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో రోడ్ల నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్లకు పాత బకాయిలను చెల్లించడంతో కాంట్రాక్టర్లు ఈ ప్రభుత్వ హయాంలో పనులు చేయడానికి ముందుకు వచ్చారు. గతంలో ఎన్‌డీబీ పనులను టెండరు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయడానికి ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖ ద్వారా ఒప్పందం చేసుకుంది. అయితే నిధులను సకాలంలో విడు దల చేయకపోవడంతో పనులను చాలాచోట్ల కాంట్రాక్టర్ నిలిపివేశారు. వాస్తవంగా ఇప్పటి వరకు ఆ కాంట్రాక్టర్‌కు రూ.50 కోట్లే చెల్లించారు. ఇంకా రూ.40 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి నవి వివిధ దశల్లో ఉన్నాయి. వాస్తవంగా పూర్తి చేయాల్సిన ఎనిమిది రోడ్లు నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులే. కాగా వీటి శంకుస్థాపనల్లో పాల్గొన్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి పెదపాడులో చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఈ రోడ్లను పరిశీలించి త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. అయినా ఇప్పటి వరకు ఏ చర్యలు లేవు.

నాలుగు రోడ్లు అరకొర నిర్మాణాలే..

ఏలూరు జిల్లాలో నాలుగు రోడ్లు మొత్తం 39.41 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టగా ఏదీ పూర్తి కాలేదు. ఏలూరు- జంగారెడ్డిగూడెం 5.96 కిలోమీటర్లు, దెందులూరు -పంగిడిగూడెం 8.61 కిమీ, ఏలూరు-కైకలూరు రోడ్డు 6.74 కిమీ, ఏలూరు- పెరికీడు (పెదపాడు పరిధి) 18.17 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి చేయాల్సి ఉంది. రోడ్ల నిర్మాణాలు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని.. కాంట్రాక్టర్లను మీరు అడగారా? అంటూ దిశ సమావేశంలో, డీఆర్‌సీ సమావేశాల్లోను సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ప్రశ్నించారు. అయినా ఇప్పటికీ వీటి నిర్మాణాలపై పురోగతే లేదు. ఇదిలా ఉండగా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనూ ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు రూ.3 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి కాలేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్వయంగా కలెక్టర్ వెట్రిసెల్వి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికీ దీనిపై ఎటువంటి పురోగతి లేదు.

పశ్చిమలో మూడు పూర్తి.. నాలుగు రోడ్లు తూతూ మంత్రంగానే..

పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు -భీమవరం 14.45 కిలోమీటర్లు, పాలకొల్లు- ఆచంట 1.66 కిమీ, మేడపాడు- నరసాపురం వయా చించినాడ 4.37 కిమీ, పెనుమంట్ర- వీరవాసరం 0.6 కిమీ మేర అభివృద్ధి జరగాల్సి (మిగతా 8వ పేజీలో)


కమిషనర్ వెంకటరామిరెడ్డితో చర్చిస్తున్న జన సైనికులు

టార్గెట్..చైర్మన్ పీఠం!

- నూజివీడు పురపాలకంపై జనసేన దృష్టి
- పట్టణ సమస్యలపై అడుగులు వేస్తున్న జన సైనికులు
- కమిషనర్ ఎదుట పలు డిమాండ్లు

(నూజివీడు - ఆంధ్రజ్యోతి)

నూజివీడు నియోజకవర్గంలో ఆసక్తికరంగా రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయి. నియోజకవర్గ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి బీజేపీకి కేటాయించడంతో తెలుగుదేశంపార్టీ మరో మిత్ర పక్షమైన జనసేనకు చెందిన నూజివీడు జనసైనికులు నూజివీడు పురపాలక సంఘం చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఈ పదవిని కోరడానికి తమకు సంపూర్ణ అర్హత ఉందంటున్నారు. నూజివీడు పట్టణంలో 2024 ముందువరకు జరిగిన ఏ ఎన్నికల్లోనూ పట్టణంలో టీడీపీ ఒక్క ఓటు కూడా ఆధిక్యత సాధించలేదు. 2024లో జనసేన, టీడీపీకి మిత్రపక్షం అయిన తరువాతే 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి పట్టణంలో ఆరు వేలకు పైగా ఆధిక్యత వచ్చిన విషయాన్ని జన సైనికులు గుర్తు చేస్తున్నారు. దీనికోసం గత ఎన్నికల్లో తాము పడిన కష్టాన్ని టీడీపీ గుర్తించాలని వారు కోరుతున్నారు.

అజెండాతో కదిలిన జనసైనికులు

రానున్న పురపాలక ఎన్నికల్లో పట్టణంలోని 32 వార్డుల్లో అత్యధిక వార్డుల్లో జనసేన అభ్యర్థులను పోటీ చేయించాలని జనసేన నాయకులు భావిస్తున్నారు. మిత్రపక్షాల సహకారంతో అత్యధిక వార్డులను గెలుచుకుని చైర్మన్ పదవిని సాధించాలనే అజెండాతో జనసేన శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పట్టణ జనసైనికులు నూజివీడు పురపాలక కమిషనర్ వెంకటరామిరెడ్డిని కలిసి పట్టణ సమస్యలపై చర్చించి పలు డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

కమిషన్ ఎదుట జనసేన డిమాండ్లు ఇవి..

నూజివీడు పట్టణ అభివృద్ధికి ఇటీవల కేటాయించిన రూ.ఐదుకోట్ల నిధులతో జరగనున్న పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా పాటించాలని, లేకపోతే తాము చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. టెండర్లలో పాల్గొని పనులు చేయలేమని చెప్పి, పనుల నుంచి తప్పుకున్న కాంట్రాక్టర్ల వల్ల రూ.50 లక్షలు నష్టం మునిసిపాలిటీకి జరిగిందని, ఆ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలన్నారు. టిడ్కో ఇళ్ల పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. పారిశుద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, కుక్కలు, పాములు, కోతుల నుంచి ప్రజలను కాపాడాలని, కృష్ణా వాటర్ ప్రతిరోజూ అందేలా (మిగతా 8వ పేజీలో)

ఈ నీరు తాగలేం!

రక్షిత నీటి పథకాలు అస్తవ్యస్తం

పడకేసిన ఫిల్టర్ బెడ్‌లు.. పగిలిన పైపులైన్లు



■ లోపలి పేజీలో..

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని.. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

- న్యాయవాదుల ప్రదర్శన.. అడ్డుకున్న పోలీసులు

నూజివీడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం ఆందోళన చేపట్టారు.కోర్టు హాలు నుంచి న్యాయవాదులు బైక్ ర్యాలీ చేపట్టగా ఆర్టీసీ బస్టాండు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ నిరసన తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూజివీడు నియోజకవర్గాన్ని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోకి తీసుకొస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర గడుస్తున్నా హామీని అమలు చేయలేదని, తక్షణం హామీని అమలుపరచాలని వారు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మున్నెం రమేష్, మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

30 సంవత్సరాల తర్వాత కాట్రేనిపాడుకు సాగర్ జలాలు

ముసునూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాట్రేనిపాడుకు 30 ఏళ్ల తర్వాత రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారం కృషితో సాగర్ జలాలు ఎట్టకేలకు వచ్చాయి. గ్రామానికి వస్తున్న సాగర్ జలాలను డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపాడు మేజర్ కాలువ నుంచి కాట్రేనిపాడుకు నీరు వచ్చే మైనర్ కాలువలో సుమారు 300 మీటర్లు కాలువ తవ్వకం ఒక రైతు అడ్డుకోవడం వల్ల ఆగిపోయిందన్నారు. దీంతో ఏళ్ల తరబడి కాట్రేనిపాడు చెరువులకు సాగర్ జలాలు నిలిచిపోయాయన్నారు. ఈ సమస్యను స్థానిక టీడీపీ నాయకులు, రైతులు, మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం 300 మీటర్ల కాలువ తవ్వకం సాధ్యపడదని, ప్రత్యామ్నాయంగా వేంపాడు మేజర్ కాలువ నుంచి జంగంగూడెం అడవి మీదుగా కాట్రేనిపాడు మైనర్ కాలువకు కలిపేలా తాత్కాలికంగా కాలువను ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించి కాలువ తవ్వకానికి అవసరమైన నగదును సమకూర్చినట్టు తెలిపారు. సుమారు రూ.లక్షా 50 వేలతో కాట్రేనిపాడు మైనర్ కాలువకు కలిపేలా తాత్కాలిక కాలువను ఏర్పాటు చేసేందుకు టీడీపీ నాయకులు బొమ్మగంటి శ్యామలరావు, గద్దల మోహన్‌రావు, సూర్యదేవర శ్రీనివాసరావు, బడిపాటి సాంబయ్య, రాపర్ల ప్రతాప్‌లతో పాటు రైతులు కృషి చేశారన్నారు. దీంతో 30 ఏళ్ల తర్వాత కాట్రేనిపాడు చెరువులకు సాగర్ జలాలు వచ్చాయని చైర్మన్ తెలిపారు.


కాట్రేనిపాడుకు వస్తున్న సాగర్ జలాలను పరిశీలిస్తున్న చైర్మన్ బాలకృష్ణ, తదితరులు


ఆకివీడులో ఫిల్టర్ బెడ్‌లలో పచ్చగా కనబడుతున్న నీరు


కైకలూరు ఫిల్టర్‌బెడ్స్‌లో దట్టంగా మొలిచిన జమ్ము


మండవల్లి మండలం పెనుమాకలంకలో ఫిల్టర్‌బెడ్స్

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఈ నీరు తాగలేం!

రక్షిత నీటి పథకాలు అస్తవ్యస్తం

పడకేసిన ఫిల్టర్ బెడ్‌లు.. పగిలిన పైపులైన్లు


కత్తవపాడులో శిథిలావస్థలో ట్యాంక్

ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రధానంగా ఫిల్టర్ బెడ్‌లు పని చేయడం లేదు. చాలా చోట్ల క్లోరినేషన్ చేయడం లేదు. పలుచోట్ల పైపులైన్లు పగిలిపోయాయి. కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఏళ్ల తరబడి ఇసుక మార్చడం లేదు. మరమ్మతులకు గురైన బెడ్‌లను గాలికొదిలేశారు. తాగునీరు పసర్లు తేలితే, ఫిల్టర్ బెడ్‌లలో దట్టంగా పెరిగిన గడ్డి పాలకులు, అధికారుల నిర్లక్ష్యాన్ని పట్టిచూపుతోంది. పైపులైన్ లీకేజీలతో నీరు వృథాగా పోతుంది. మరోవైపు సామాన్యులు తాగే కొద్దిపాటి నీరు మురుగుతో కలుషితమవుతోంది.


చింతలపూడిలో మంచినీటి ట్యాంక్

ఏలూరులో కలుషిత నీరు


ఏలూరులో ఫిల్టర్ బెడ్‌లు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు కార్పొరేషన్ విలీన గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శనివారపుపేట, తంగెళ్లమూడి, పోణంగి, చొదిమెళ్ల, కొమడవోలు, సత్రంపాడు, వెంకటాపురం గ్రామాల్లో సుమారు 80వేల మంది నివసిస్తున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో సరిగా ఫిల్టరైజేషన్ చేయకపోవడం వలన తాగునీరు కలుషితమై దుర్వాసన వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. బోరు నీటిని మోటార్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకుకు పంపి బ్లీచింగ్‌చల్లి సరఫరా చేయడంతో పరిశుభ్రమైన నీరు రావడం లేదు. అక్కడక్కడ పైపులైన్ల లీకేజీ కారణంగా డ్రెయినేజీ మురుగు కలుస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో సుమారు 2.5లక్షల మంది జనాభాకు రెండు పూటల తాగునీరు సరఫరా అవుతోంది. పంపుల చెరువు వద్ద వాటర్‌ను ఫిల్టర్ చేసి సరఫరా చేస్తున్నారు. నగరంలో తాగునీటిపై ఫిర్యాదులు లేవు. దెందులూరు వద్ద 110 ఎకరాల పంపుల చెరువు నుంచి గోదావరి వాటర్, నగరంలోని పంపుల చెరువు నుంచి కృష్ణావాటర్‌కు ప్రతీరోజు రెండు పూటల తాగునీరు సరఫరా చేస్తున్నారు. నగరంలో నూతన పైపులైన్‌తో లీకేజీ సమస్యలు లేవు.

చింతలపూడిలో రక్షిత నీటి సరఫరా అధ్వానం

చింతలపూడి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో 19 పంచాయతీలు, చింతలపూడి నగర పంచాయతీలో రక్షిత మంచినీటి సరఫరా పథకాలు ఉన్నాయి. చింతలపూడి పట్టణం మినహా మిగిలిన గ్రామాల్లో తాగునీటి సరఫరా అధ్వానంగా ఉంది. 24 గంటల విద్యుత్ సరఫరాతో మోటార్లు ఆన్‌చేసి రాత్రి వరకు సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లో మంచినీరు వృథా అవుతోంది. పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవడమే. సచివాలయ కార్యదర్శులు అజమాయిషీ నీటి సరఫరాపై పర్యవేక్షణ కొరవడింది. చాలా చోట్ల వీధి కుళాయిలకు ప్లాట్‌ఫారాలు లేవు. మండలంలో సుమారు 60 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. రేచర్ల తండాలో ట్యాంకు లీకేజీ కావడంతో మోటారు నేరుగా కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. లింగగూడెం, ఊట సముద్రం గ్రామాల్లో పైపులైన్లు లీకేజీలున్నాయి. మరమ్మతులు చేయకపోవడం వలన మురుగునీరు పైపుల్లోకి పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చింతలపూడిలో సబ్ డివిజన్ కార్యాలయం ఉండేది. గత ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ డీఈ శాఖలను నూజివీడులో కలిపింది. మండల ఏఈ ఉన్నా లింగపాలెం మండల ఇన్‌చార్జి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. సబ్ డివిజన్‌లు ఎత్తివేయడం, గ్రామీణ నీటిసరఫరాపై అజమాయిషి లేకపోవడం, ట్యాంకులు పరిశుభ్రత లేకపోవడం జరుగుతుంది. సీజన్ మారినప్పుడల్లా ఆరోగ్య శాఖ గ్రామీణ సరఫరా శాఖలు పర్యవేక్షించి ట్యాంకులను క్లీనింగ్ చేయాల్సి ఉంది. అవి కూడా చేయకపోవడం రక్షిత నీరు అందడం లేదు.

శుద్ధమైన నీటిని సరఫరాచేస్తున్నాం

ఏలూరు నగర ప్రజలకు కుళాయిల ద్వారా పరిశుభ్రమైన నీటిని అందిస్తున్నాం. సెడిమెంటేషన్, క్లోరినేషన్, ఫిల్టరైజేషన్ చేస్తున్నాం. రక్షిత నీటి పథకాల్లో మొత్తం 8 ఫిల్టర్‌బెడ్‌లున్నాయి. వీటిలో ప్రతీరోజు శుభ్రం చేస్తాం. ఎక్కడా పైపులైను లీకేజీ లేదు. ఎక్కడైన లీకేజీలు ఉంటే అప్పటికప్పుడే సరి చేస్తున్నాం. డ్రెయినేజీ వాటర్ ఎక్కడా కూడా మంచినీటి పైపులైన్లలో కలవడం లేదు.

- నారాయణరావు, డీఈ, మునిసిపల్ కార్పొరేషన్, ఏలూరు

ట్యాంక్‌ల నిర్మాణాలకు చర్యలు

కొన్ని గ్రామాల్లో రక్షిత నీటి పథకాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరడం వాస్తవమే. జలజీవన్ మిషన్ పథకంలో నూతన ట్యాంక్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పాత ట్యాంక్‌లను తొలగించి, నూతన ట్యాంక్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. కుళాయిల ద్వారా రక్షిత నీరు సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- కె.సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ముసునూరు మండలం

కలుషిత నీటితో ఇబ్బందులు



నగర కార్పొరేషన్ విలీన గ్రామాల్లోని ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో ఫిల్టర్‌బెడ్‌లు లేకపోవడంతో బ్లీచింగ్ చల్లి వాటర్ సరఫరా చేస్తున్నారు. తాగునీటిపైపుల లీకేజీ వలన డ్రెయినేజీ మురుగు కలిసి దుర్వాసన వస్తుంది. ఈ గ్రామాల్లో తాగునీటిలో సుద్ద వస్తుంది. దీంతో నీరు కాచుకుని తాగాల్సి వస్తుంది. లేదంటే ప్రజలు బయట కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి.

- పి.కిశోర్, సీపీఐ నాయకుడు, ఏలూరు

ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ లోపం



గ్రామ పంచాయతీలు రక్షిత నీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నాయి. నిధుల కొరత వల్ల ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతు చేయించడం లేదు. లక్షలాది రూపాయలతో నిర్మించిన నీటి పథకాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో నీటి పథకాలు ఉన్నా ప్రజలు తాగునీటి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నీటి పథకాలను నిర్వహిస్తే బాగుంటుంది. లేకుండా ఈ పథకాల నిర్వహణకు గ్రామపంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఉల్లంకి కోదండ రామయ్య, దేవపూడి, ముదినేపల్లి మండలం

ఆకివీడు పైపులైన్లకు మరమ్మతులు

ఆకివీడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో 50 వేల జనాభాకు ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం 18 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రధాన పైపు లైన్ ఏర్పాటుచేసి 60 ఏళ్లు కావడంతో తరచు లీకేజీ సమస్యల తలెత్తుతోంది. భుజబలరాయుడు, భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకు మంచినీటి చెరువు ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చకపోవడంతో నీరు శుద్ధి కావడం లేదు. పైపులైన్ లీకేజీతో మురుగుతో తాగునీరు కలుషితమవుతోంది. అదనంగా ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం సంతమార్కెట్, శాంతినగర్, ధర్మాపురం ట్యాంకులు శిథిలావస్థకు చేరుకోవడంతో తాగునీరు వృథా అవుతోంది. మంచినీటి చెరువులకు అవుట్ లెట్‌లు లేవు, జనరేటర్లు లేకపోవడంతో కరెంటు ఉంటేనే తాగునీరు సరఫరా చేస్తుంటారు. పెద్ద, చిన్న పల్లె వీధులు, తెలగపాముల వీధికి, రైల్వేస్టేషన్ ఎదురుగా, సమతానగర్, ఎఫ్‌సీఐ దగ్గరకు ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో సుమారు 80 శాతం జనాభా బయట నీటిని కొనుగోలు చేసుకుంటే, కొందరు ఇళ్లలో ఫిల్టర్ వేయించుకొని నీటిని తాగుతున్నారు. భుజబలరాయుడు చెరువు దగ్గర కుండీ శ్లాబ్ పగిలిపోయింది. సమస్యలు పరిష్కరించాలని పాలకవర్గం, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

లింగపాలెం పైపులైన్‌కు పగుళ్లు


పైపులైన్‌కు మరమ్మతులు (ఫైల్)

లింగపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛమైన తాగు నీరందక, కలుషిత నీరు తాగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ట్యాంకులు సరిగా లేకపోవడం, పైపులైన్ మరమ్మతులతో తాగునీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనపనేనివారిగూడెంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. సమీపంలోని పుప్పాలవారిగూడెం నుంచి పంట పొలాల మీదుగా పైపులైన్‌ను వేసి తాగునీరందిస్తున్నారు. పంటల సమయంలో రైతులు దున్నుకునే సమయంలో ప్రతిసారి పైపులు పగిలిపోతుండడంతో కలుషిత నీరు వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక్కోసారి పంటపొలాలలో రసాయన ఎరువులు కలిసిన నీరు వస్తుండడంతో అనారోగ్యాల పాలవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ పైపులైన్‌లు పగిలిపోతుండటంలో తాగునీటికి, కనీస అవసరాలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్‌ను మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ధర్మాజీగూడెం, టీసీహెచ్‌ఆర్‌పాలెం వాటర్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. సమీపంలో నిత్యం పిల్లలు, గ్రామ స్తులు తిరుగుతుంటారని ఈ ట్యాంకులు ఎప్పుడు కూలుతాయో, ఎటువంటి ప్రమాధం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ఫిల్టర్‌బెడ్స్‌లో మొలకెత్తిన జమ్ము, పిచ్చి మొక్కలు!


బొమ్మినంపాడులో మూలనపడ్డ వాటర్ ప్లాంట్

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రక్షిత నీటి పథకాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వైసీపీ పాలనలో రక్షిత నీటి పథకాలకు ఒక్క ఫిల్టర్‌బెడ్ నిర్మాణం చేయకపోగా ఉన్నవాటిని మరమ్మతు చేయలేదు. దీంతో ప్రజలకు కాలువల్లో నీటినే నేరుగా సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టినప్పటికీ నిధుల లేమి వెన్నాడుతోంది. కైకలూరు మండలంలో సుమారు 18 గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్స్ పడకేశాయి. కైకలూరులో 6 ఫిల్టర్‌బెడ్స్ నోచుకోకపోవడంతో మరుగున పడ్డాయి. రూ.1.9 లక్షలతో నిర్మాణం చేసిన ర్యాపిడ్ శాండ్‌ఫిల్టర్ పనిచేయకపోవడంతో నేరుగా నీటిని విడుదల చేస్తున్నారు. ఆటపాక, భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు, సీతనపల్లి, వరహాపట్నం, రాచపట్నం, గోపవరం తదితర గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది. ఫిల్టర్‌బెడ్స్‌ను వినియోగించకపోవడంతో వాటిలో పిచ్చిమొక్కలు, జమ్ము దట్టంగా పెరిగిపోయాయి. స్థానికంగా గ్రామ పంచాయతీ అధికారులు సైతం కనీస మరమ్మతులు నిర్వహించేందుకు సముఖత చూపడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించినా నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు శుద్ధి కాని జలాలనే వినియోగించుకోవాల్సి వస్తోంది.

కలిదిండిలో 15 బెడ్‌లకు మరమ్మతులు

కలిదిండి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 25 రక్షిత నీటి పథకాలున్నాయి. 15 రక్షిత నీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్‌లు నిరుపయోగా ఉన్నాయి. తాగునీరు ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయిలకు వదులుతున్నారు. ఈ నీరు తాగలేక ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. మూల్లంక రక్షిత నీటి పథకం ఫిల్టర్‌బెడ్‌ల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోవటంతో చెత్తాచెదారంతో పూడిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు చేసి సురక్షిత వాటర్ అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుమాకలంకలో పనిచేయని ఫిల్టర్ బెడ్స్

మండవల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమాకలంకలో నాలుగేళ్ల క్రితమే ఫిల్టర్‌బెడ్లు పాడైపోయాయి. చెరువులో నీరు రంగు మారి మురుగు వాసన కొడుతున్నా శుద్ధి చేయకుండా విడుదల చేస్తున్నారు. 2 వేల జనాభా కలిగిన గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఫిల్టర్‌బెడ్‌లతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకులు కూడా శిథిలావస్థకు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారు.

ముదినేపల్లిలో ఒక్క నీటి పథకం పని చేస్తే ఒట్టు!

ముదినేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రక్షిత నీటి సరఫరా పథకాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడంతో ఒక్క గ్రామంలో కూడా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో 36 రక్షిత నీటి సరఫరా పథకాలున్నాయి. ఒక్క పథకం ద్వారా కూడా తాగునీటి సరఫరా జరగడం లేదు. ఫిల్టర్ బెడ్ల నిర్వహణ లేకపోవడంతో శుద్ధి చేయని నీటిని సరఫరా చేస్తున్నారు. నిధుల కొరత వల్ల నీటి పథకాలను పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోతున్నామని సర్పంచ్‌లు చెబుతుండగా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రం. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శిథిలమవుతున్నా పట్టించుకోవడం లేదు. నాంది ఫౌండేషన్ గతంలో బొమ్మినంపాడు, పెయ్యేరు, గురజ, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్లు కూడా నిర్వహణలోపంతో మూలనపడ్డాయి. ముదినేపల్లిలోని ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలమై ప్రమాదకరంగా ఉన్నా అలాగే నీటిని సరఫరా చేస్తున్నారు.

ముసునూరులో కలుషిత నీరే దిక్కు!

ముసునూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సరఫరా ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. బీటలు వారి, పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గోపవరం, గోగులంపాడు, యల్లాపురం, ముసునూరు, రమణక్కపేట ట్యాంకులను సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించారు. ట్యాంకులు, స్తంభాలు పెచ్చులూడి ఐరన్ బయటపడింది. ట్యాంకుల పైకి మెట్లు ధ్వంసమయ్యాయి. ట్యాంక్‌ల నుంచి వచ్చే కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది. శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను తొలగించి కొత్త ట్యాంక్‌ల నిర్మాణాలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మూల్లంక ఫిల్టర్ బెడ్ లో దట్టంగా పిచ్చిమొక్కలు

కత్తవపాడులో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

ఇరగవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కత్తవపాడులో 20 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ శుభ్రపరిచేందుకు ఎక్కడానికి మెట్ల గోడలు శిథిలం కావడంతో వెదురు కర్రలను ఏర్పాటు చేశారు. సిబ్బంది ప్రాణాన్ని పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్నారు. ట్యాంక్‌పై పెచ్చులు ఊడిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు.

అధ్యక్షా..

ఎర్ర కాలువ రైతులను ఆదుకోవాలి



బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎర్ర కాలువ కింద ఉన్న రైతులు ముంపుతో ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసెంబ్లీలో ప్రస్తావించారు. ముంపు నష్టం కింద ఏటా రూ.7 నుంచి 8 కోట్లు పరిహారం ఇస్తున్నామన్నారు. పరిహారంతో రైతుల బతుకులు మారవని, పంట ఇంటికి చేరితేనే రైతులకు ఆనందం అన్నారు. గట్లు పటిష్టతకు రూ.10 కోట్లు విడుదల చేయాలన్నారు. లో లెవెల్, మిడ్‌లెవెల్ కాల్వలు, ఏలూరు కాలువ పూడిక తీయడానికి కూడా నిధులు ఇవ్వాలన్నారు.

విద్యుత్ సంస్కరణలు అభినందనీయం



ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు

తణుకు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో విద్యుత్ సంస్కరణలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ పాలసీ 2024 ద్వారా సోలార్ ఎనర్జీ సామర్థ్యం పెంచే విధంగా చర్యలు తీసుకుందన్నారు. 10 లక్షల కోట్ల పెట్టుబడితో 7.50లక్షలు ఉద్యోగాలు కల్పించాలనే ధ్యేయంతో పాలసీ తీసుకురాడం అభినందనీయమని వివరించారు. టైమ్ ఆఫ్ డే, రియల్ టైం సెటిల్మెంట్ మెకానిజంపై పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆలోచన చేస్తున్నారని, దీనిపై కొన్ని అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఎనర్జీ బ్యాంకింగ్‌లో కఠినమైన నిబంధనలు, రియల్ టైం కారణంగా పంపిణీ, వినియోగంలో వ్యత్యాసాలు రావడం, పీక్ అవర్ విద్యుత్ వియోగంపై అభ్యంతరాలు వస్తున్నాని చెప్పారు. వీటిని పరిగణనలోకి తీసుకుని పరిశ్రమలకు ఉపయోగపడే పాలసీలో మార్పులు తీసుకురావాలని కోరారు.



భక్తుల సౌకర్యార్థం దేవస్థానం రీమోడల్ చేసిన ఉచిత బస్సు

చిన వెంకన్న భక్తులకు ఉచిత బస్సు సిద్ధం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్న ఆలయానికి భక్తులను చేరవేసే ధర్మరథం ఉచిత బస్సును శుక్రవారం సిద్ధం చేశారు. ఆలయ ఈవో పూజలు నిర్వహించి ప్రారంభించారు. దేవస్థానానికి మూడు ధర్మరథం బస్సులు ఉండగా ఒక ఎస్ఎంఎల్ బస్సుకు మరమ్మతులకు గురైంది. శనివారం నుంచి బస్సులో భక్తులకు ప్రయాణ సౌకర్య కల్పిస్తారు. దేవస్థానానికి ఉన్న మూడు బస్సుల్లో ధర్మరథం 42 సీట్లు, ధర్మపరిరక్షణ రథం 41 సీట్లు, ఉచిత బస్సు 33 సీట్లు ఉంటాయని సిబ్బంది తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ధర్మరథం బస్సు కొండపై తూర్పువైపున గల జంటగోపురాల నుండి బయల్దేరి వకుళమాత అన్నప్రసాద భవనం ఒకటో గేటువద్ద శివాలయం, కొండ దిగువ ఆర్టీసి బస్టాండు, గుడి సెంటర్, ఉగాది మండపం, టోల్‌గేట్ స్టాపులలో ఆగుతూ భక్తులకు సేవలను అందిస్తుందని సిబ్బంది తెలిపారు.

సీసీటీవీ, సెక్యూరిటీ అలారంపై ఉచిత శిక్షణ

పెదపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వట్లూరు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిరుద్యోగ యువతకు సీసీటీవీ కెమెరా, సెక్యూరిటీ అలారంపై 13 రోజుల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అక్టోబరు 3 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుందని, 10వ తరగతి, ఆపై విద్యార్హత గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లలో 99485 65256, 90140 40780, 95330 79471 సంప్రదించాలన్నారు.


కాళ్లకూరు వెంకన్న ఆలయంలో హోమాలు చేస్తున్న పండితులు

కాళ్లకూరు ఆలయంలో ధన్వంతరి హోమం

కాళ్ళ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధన్వంతరి హోమం నిర్వహించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో ఉండాలని, స్వామివారికి సంకల్పం చేసుకొని పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం ధన్వంతరి హోమం, మూలమంత్ర సహిత పంచసూక్త హవనం, వాస్తు హోమం, తీర్థ గోష్ఠి కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈవో ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం మహాపూర్ణాహుతి నిర్వహించి స్వామి అమ్మవార్లకు గంగ, యమున, సరస్వతి, నర్మద, తుంగభద్ర, కృష్ణ, కావేరి నదీ జలాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తామని, శాంతి కల్యాణ మహోత్సవం జరపనున్నట్లు ఈవో తెలిపారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి వైద్య శిబిరాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి వైద్య శిబిరాలను సద్వినియోగంచేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శోభ సూచించారు. గుడివాకలంక పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్, ఉప సర్పంచ్ ప్రారంభించారు. డీఐవో శోభ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరీక్షలు చేస్తున్నారని, మహిళలు సహకరించాలన్నారు. డాక్టర్ ఏవీఆర్.మోహన్, డాక్టర్ ఫణీంద్రబాబు, డాక్టర్ పూర్ణశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


అసోసియేట్ ప్రొఫెసర్ సంపతరావును సత్కరిస్తున్న డీన్, అధ్యాపకులు

ఉద్యాన వర్సిటీలో ర్యాంకుల పంట

ఎమ్మెస్సీ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయి ర్యాంకులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెస్సీ ప్రవేశ పరీక్షలో వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వ విద్యాలయ విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఎమ్మెస్సీ కోర్సుల ప్రవేశానికి జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) నిర్వహించిన పరీక్షల్లో రికార్డు స్థాయిలో ర్యాంకులు రావడం అభినందనీయమని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ ఎస్.సూర్యకుమారి అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాల విద్యార్థులు ఇటీవల ఐసీఏఆర్ నిర్వహించిన ఎమ్మెస్సీ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన పి.జ్యోతిర్మయి (ఉద్యాన శాస్త్రం) 5వ ర్యాంకు, ఎ.గంగాప్రసాద్ (ఫిజికల్ సైన్స్) 14వ ర్యాంకు, ఎ.వీర సూర్యపవన్ (ప్లాంట్ సైన్స్)తోపాటు జాతీయ స్థాయిలో 50 లోపు 3 ర్యాంకులు, 500 లోపు 13 ర్యాంకులు, వెయ్యిలోపు 37 ర్యాంకులు సాధించిన విద్యార్థులను సూర్యకుమారి, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులు ఇంతటి ఘనత సాధించేందుకు కృషిచేసిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సంపతరావును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఏవీడీ దొరాజీ, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు ముందే దసరా సెలవులు

ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో సంతోషం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల కోరిక మేరకు దసరా సెలవులను ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు పండుగ సెలవులుంటాయి. పాఠశాల విద్య విడుదల చేసిన అకడమిక్ కేలండర్ ప్రకారం దసరా సెలవులు ఈ నెల 24 నుంచి అక్టోబరు 2 వరకు ఇవ్వాల్సి ఉంది. ఉపాధ్యాయుల అభ్యర్థనను శుక్రవారం విద్యా శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి టీడీపీ ఎమ్మెల్సీలు తీసుకెళ్లగా సానుకూల స్పందన వచ్చింది. టీచర్లు ఆశించిన విధంగా రెండు రోజులు ముందుగానే దసరా సెలవులు ఇస్తున్నట్టు మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రెండు రోజులు అదనంగా సెలవులు ఇస్తున్నట్లు మంత్రి ప్రకటన నిమిషాల వ్యవధిలో ఉపాధ్యాయ వర్గాల్లో వైరల్ అయింది. తాజా నిర్ణయంతో దసరా పండుగకు 12 రోజుల సెలవులు ఇచ్చినట్టయింది. ఈ నెల 22 నుంచే దసరా సెలవులు ఇస్తున్నట్టు అధికారిక ప్రకటన శనివారం వెలువడుతుందని భావిస్తున్నారు.



ఎమ్మెల్సీ గోపిమూర్తి, యూటీఎఫ్ నాయకుల ఐక్య నినాదం

యూటీఎఫ్ రణభేరికి మద్దతు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న గుంటూరులో రణభేరి బహిరంగ సభకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మద్దతుగా పాల్గొంటామని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ప్రకటించారు. ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఉమ్మడి గోదావరి జిల్లాలో చేపట్టిన బైక్ జాతా శుక్రవారం ఏలూరులో ముగిసింది. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంవద్ద నిర్వహించిన ముగింపు సభ, మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రకటించాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర మాధ్యమ బోధన కొనసాగించాలన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లందరికీ వర్తించేలా ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను పార్లమెంటు ఆమోదించేలా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కనీస వేతన స్కేలు(ఎంటీఎస్) ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించి, వారికి ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను పరిష్కరించాలన్నారు. 12వ పీఆర్సీని నియమించాలని, 29శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. గుంటూరు రణభేరి సభకు 10వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరయ్యేలా అన్ని జిల్లాల్లో బైక్ జాతా ద్వారా సమాయత్త పరుస్తున్నామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ వివరించారు. సంఘ నాయకులు అరుణకుమారి, సుభాషిణి, శ్రీదేవి, జ్యోతిబసు, చక్రవర్తి, జయకర్, షరీఫ్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవో సంఘాన్ని బలోపేతం చేయాలి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఏపీ ఎన్జీవో సంఘాన్ని బలోపేతం చేయాలని, సభ్యత్వం పెంచాలని జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో ఏపీ ఎన్జీవో సంఘ ఏలూరు తాలూకా కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం 70 ఏళ్ల నుంచి ఏపీ ఎన్‌జీవో సంఘం సేవలందిస్తుందన్నారు. త్వరలోనే ఏలూరు తాలూకా యూనిట్ ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. గత 5 ఐదేళ్లుగా ఉద్యోగులకు అనేక సమస్యలు పేరుకుపోయాయని, ముఖ్యంగా సరెండర్ లీవ్‌కు సంబంధించిన నగదు, 3 ఆర్థిక సంవత్సరాల బకాయి, 4 కరువు భత్యాలు, 12వ పే రివిజన్ కమిటీ ఏర్పాటుచేసి కమిటీ రిపోర్టు వచ్చేలోపు మధ్యంతర భృతి 30శాతం ఇవ్వాలని, హెల్త్‌కార్డ్ విషయంలో జాప్యం నివారించాలని కోరారు. సమావేశంలో కార్యక్రమంలో ఎన్జీవో సంఘ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తూర్పు విప్పర్రు విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఇరగవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి ఈత పోటీల్లో తూర్పువిప్పర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.ఉషశ్రీ తెలిపారు. అండర్ 17 విభాగంలో ఎ.ధనుంజయ్, పితా.బాబి, జి.కృష్ణతేజ, ఎస్.కిరణ్‌కుమార్ ఎంపిక కాగా అండర్ 14 విభాగంలో టి.సత్యనారాయణ ఎంపికైనట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు వి.సుమలత, సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆకేటి నరసింహరావు, ఆకేటి కాశీ విద్యార్థులను అభినందించారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో ఏఆర్‌డీజీకే విద్యార్థుల ప్రతిభ


విజేతలతో ఏఆర్‌డీజీకే పాఠశాల హెచ్‌ఎం

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌లో ఏఆర్‌డీజీకే హైస్కూలు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం విక్రాంతి జయకుమార్, జోజిబాబు, టి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. సీహెచ్.భార్గవి అండర్-18 రన్ వాక్‌లో ఐదు కిలోమీటర్లలో రెండో స్థానం లభించింది. జె.పల్లవి మూడు కిలోమీటర్లు లాంగ్ డిఫెన్స్ రన్‌లో జె.పల్లవి ద్వితీయ స్థానం, ఐదు కిలోమీటర్ల లాంగ్ డిఫెన్స్ రన్‌లో కె.హాసిని మొదటి స్థానం సాధించింది. 600 మీటర్ల రన్‌లో ఎస్.అశ్విని, అండర్-16 హైజంప్‌లో మొదటి స్థానం సాధించినట్టు హెచ్‌ఎం శాంతి జయకుమార్ తెలిపారు.




ఫోన్‌లో ప్రజల సమస్యలు వింటున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, నమోదు చేసుకుంటున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు

సమస్యల వెల్లువ

పరిష్కారానికి కృషి చేస్తానన్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

- » పెదవేగి స్కూల్‌లో టాయిలెట్ల సమస్య
- » వీరవాసరం జడ్పీ హైస్కూల్ స్థలం ఆక్రమణ
- » కొబ్బరిచెట్ల ఫలసాయం మాయం
- » అధ్వానంగా డ్రెయిన్లు, రోడ్లు
- » తాగునీటి సమస్యలు అపారం
- » జీతాల కోసం ఉద్యోగుల వినతి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చాలా సమస్యలు పరిష్కారం కావడం లేదు. విద్యార్థినులకు కనీస మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. పలు ప్రాంతాల్లో అధ్వానంగా తయారైన రహదారులు అభివృద్ధి చేయాలి. డ్రెయిన్లు సరిగా లేక మురుగునీరు పారడం లేదు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు ఎక్కువే. వీటిని పరిష్కరించాలి. ఆక్రమణలకు గురవుతున్న పాఠశాల స్థలాలను పరిరక్షించాలి' అంటూ పలు రకాల సమస్యలను శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' ద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దృష్టికి పలువురు తీసుకువచ్చారు.

ఒక్కో స్కూల్‌లో ఒక్కో సమస్య

- పెదవేగి జడ్పీ హైస్కూల్‌లో 300 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో సగం మంది విద్యార్థినులు. ఈ స్కూల్‌లో టాయిలెట్స్ లేక వారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పాం. కలెక్టర్ గారికి ఈ సమస్య విన్నవించగానే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా టాయిలెట్ల సమస్యను పరిష్కరించండి.

- తొంటా తాతయ్య, పెదవేగి

చైర్ పర్సన్ పద్మశ్రీ : సంబంధిత అధికారులతో మాట్లాడతా. అంచనాలు రూపొందించి, నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తాం.

- వీరవాసరం జడ్పీ హైస్కూల్‌లో వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ స్కూల్ స్థలం ఆక్రమణలకు గురైంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ స్కూల్‌లో ఆక్రమణలు తొలగించి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలి.

- నక్కెళ్ళ శివరామకృష్ణ, వేంద్ర దివాకర్, నక్కెళ్ళ గోపాలకృష్ణ, వీరవాసరం. సత్యసురేష్, నందమూరిగరువు

చైర్ పర్సన్ పద్మశ్రీ : జడ్పీ నుంచి ఒక అధికారిని సోమవారం అక్కడకు పంపించి సర్వే చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో అంగన్‌వాడీ స్కూల్‌కు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలి. రాత్రి 12 గంటల సమయంలో మంచినీరు సరఫరా అవుతోంది. అలాగే రైతులకు సంబంధించి రహదారి ఏర్పాటుచేయాలి.

- కిరణ్‌కుమార్, రాజవరం శివారు గంగవరం

చైర్ పర్సన్ పద్మశ్రీ : మీరు చెప్పిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ పిల్లర్లు దెబ్బతిన్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలి.

- బి మంగయ్యనాయుడు, పోడూరు

చైర్‌పర్సన్ పద్మశ్రీ : ట్యాంక్ మరమ్మతులు చేయిస్తాం.

- మా గ్రామంలో సీసీ రహదారులు, డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంది. డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. మా ఊరి పంచాయతీ కార్యాలయాన్ని పక్క గ్రామాలకు తరలించాలని చూస్తున్నారు. ఇక్కడే ఉండేలా చూడండి.

- మాచర్ల వెంకటగణేశ్, నలమాటి సత్యభామ, కనకాద్రిపురం, కొయ్యలగూడెం

చైర్ పర్సన్ పద్మశ్రీ : మీరు చెప్పిన సమస్యను డీపీవో, ఎంపీడీవోల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం.

- బొబ్బనపల్లి నుంచి మెంతేపూడి వెళ్లే రహదారిలో 300 కొబ్బరి చెట్లు ఉన్నాయి. అవి జడ్పీ స్థలంలోనే ఉన్నాయి. వాటిని ఎవరికి వారు తీసివేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం గ్రామ పంచాయతీకి చెందకుండా ఉంది. ఈ సమస్యను పరిష్కరించాలి.

- పెద్దిశెట్టి సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, బొబ్బనపల్లి, వీరవాసరం మండలం

చైర్ పర్సన్ పద్మశ్రీ : నాలుగైదు రోజుల్లో జడ్పీ ఏఈ గారిని అక్కడకు పంపించి సమస్య పరిష్కరిస్తాం.

- మా ఊరిలో తాగునీటి కోసం కిలోమీటరున్నర వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ఇక్కడ పైపులైన్ వేయాలి.

-లంకా రాంబాబు, సత్యనారాయణ, పెదనింద్రకొలను

చైర్ పర్సన్ పద్మశ్రీ : జడ్పీ నిధులతో పైప్‌లైన్ ఏర్పాటు చేయిస్తాం.

- ఐదు గిరిజన గ్రామాలకు సంబంధించి తూర్పు కాలువపైన వున్న వంతెన కొట్టుకుపోయింది. కన్నాపురం-కొయ్యలగూడెం రహదారి అధ్వానంగా తయారైంది

- గణపతిరావు, కన్నాపురం

చైర్ పర్సన్ పద్మశ్రీ : ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో డ్రెయిన్ సరిగా తీయడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే కుక్కల బెడద ఎక్కువగా వుంది.

- వి.అమర్, వట్లూరు

చైర్ పర్సన్ పద్మశ్రీ : ఈ సమస్యలను డీపీవో దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తాం.

మా జీతాలు ఇప్పించండి

- సత్యసాయి మంచినీటి పథకం ఉద్యోగులమైన మాకు జీతాలు సరిగా రావడం లేదు. మీ దృష్టికి తీసుకువని వస్తే ఒక నెల ఇచ్చారు. మళ్లీ పెండింగ్ పెట్టారు. సమస్యను పరిష్కరించండి.

- డి.శివసత్యనారాయణ, సత్యసాయి ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు, పోలవరం, ఆచంట సత్యనారాయణ, దేవరపల్లి.

చైర్ పర్సన్ పద్మశ్రీ : ఉద్యోగులకు జీతాల నిమిత్తం రెండు కోట్లు మంజూరయ్యాయి. వారం రోజుల్లో సొమ్ములు ఇస్తాం. అలాగే ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తాం.

అభివృద్ధికి రూ.53.14 కోట్లు

'ఉమ్మడి జిల్లాలో జడ్పీ, ఇతర నిధులు రూ.53.14 కోట్లతో దాదాపు వెయ్యి అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో పలు నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన పనులు కొనసాగుతున్నాయి. రూ.99.70 లక్షలతో 9 అంగన్‌వాడీ భవనాలు, రూ.59.50 లక్షలతో కమ్యూనిటీ హాల్స్, రూ.1414.40 లక్షలతో 280 అండర్ గ్రౌండ్, ఓపెన్ డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. శ్మశానాల్లో 85 షెడ్లు, షెల్టర్లకు రూ.509.20 లక్షలు కేటాయించాం. జిల్లాలో 497 రోడ్ల నిర్మాణాలకు రూ.2,627.04 లక్షలు కేటాయించాం. 11 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.55 లక్షలు, మంచినీటి సమస్య నివారణకు బోర్ వెల్స్, పైప్ లైన్లు, కల్వర్టులు, ఆర్‌వో ప్లాంట్‌లు, రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు నిమిత్తం 98 పనులు చేయటానికి రూ.552.30 లక్షలు కలిపి మొత్తం రూ.5314.14 లక్షలు నిధులు కేటాయించాం. ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో ప్రజలు వెలిబుచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా' అని జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ తెలిపారు.



మేడమ్.. మా రోడ్లు చూడండి

- మాది బయ్యనగూడెం. మా ఊరి నుంచి సరిపల్లి-డిప్పకాయలపాడు, గోపాలపురం, మోదుగగుంట వరకు 19 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిని అభివృద్ధి చేయించండి.

  - పారేపల్లి రామారావు, బయ్యనగూడెం
- కన్నాపురం-కొయ్యలగూడెం రోడ్డు అధ్వానంగా తయారైంది. అలాగే మా ఊరిలో హిందూ శ్మశాన వాటిక పాడయ్యింది. వీటిని సరిచేయించండి.

  - బి.వెంకటరామ గంట్లయ్య, కన్నాపురం
- సరిపల్లిలో ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతులు పూడ్చటం లేదు. ఫలితంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం.

  - తోట రవి, సరిపల్లి
- మా ఊరిలో అశోక్‌నగర్‌లో రోడ్డు బాగా లేదు. దీనిని బాగుచేయించాలి.

  - జి.మేఘలాదేవి, కొయ్యలగూడెం
- మా గ్రామంలో ఎస్‌సీ కాలనీలో రెండు రోడ్లు దారుణంగా తయారయ్యాయి.

  - తమ్మిర్శి రాము, యర్రంపేట
- మా ఊరిలో రోడ్లు దారుణంగా ఉన్నాయి. సరిచేయించండి.

  - సీహెచ్. బాలగంగాధర తిలక్, కొయ్యలగూడెం
- మా ఊరి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య వల్ల దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వీటిని సరిచేయించాలి.

  - బి.చినరాజు, పరింపూడి

■ **చైర్‌పర్సన్ పద్మశ్రీ :** మీ సమస్యలను డీపీవో, ఆర్‌అండ్‌బీ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- కళ్లచెరువు-జీలకర్రగూడెం రహదారిలో ఆక్రమణలు పెరిగిపోయాయి. ఈ సమస్య పరిష్కరించాలి

- ఎం.జనార్దనరావు, కళ్లచెరువు

చైర్ పర్సన్ పద్మశ్రీ : ఈ ప్రాంతంలో రీ సర్వే చేయిద్దాం.

- నిడదవోలు మండలంలోని ఆరు గ్రామాల ప్రజలకు పీహెచ్‌సీ సమస్య ఉంది. ఇక్కడ ప్రజలు చాగల్లు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేయిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- కొయ్యే సూర్యారావు, నిడదవోలు జడ్పీటీసీ

చైర్ పర్సన్ పద్మశ్రీ : పీహెచ్‌సీ సమస్య పరిష్కరిస్తాం.

క్రైం సమాచారం

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని.. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య

టి.నరసాపురం,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టి.నరసాపురం ఎస్ఐ ఎం.జయబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. మక్కినవారిగూడెంకు చెందిన తెల్ల మేకల సత్యనారాయణ(37)కి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. తరచూ మద్యం తాగొచ్చి గొడవ పడుతుండడంతో భార్య పలుమార్లు పుట్టింటికి వెళ్లిపోయింది. రెండురోజుల క్రితం ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అతడు మద్యంతాగి తిరుగుతూ శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు గమనించి చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఇరగవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):రేలంగిలో గురువారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇరగవరం ఎస్ఐ జానాసతీష్ తెలిపిన వివరాలివి.. తణుకుకు చెందిన దాట్ల సుందరరామరాజుకు రేలంగిలో పశువుల షెడ్డు ఉంది. ఇక్కడ బొబ్బరాజుపాలెంకు చెందిన దాకే సాల్మన్‌రాజు(64) పని చేస్తున్నారు. గడ్డి తీస్తుండగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తుతెలియని విషపురుగు కుట్టిందేమో అనే అనుమానంతో చికిత్స నిమిత్తం తొలుత రేలంగి పీహెచ్‌సీకి అనంతరం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శుక్రవారం బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

అశ్లీల నృత్యాలు చేస్తున్న ఐదుగురి అరెస్టు

ఇరగవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):రేలంగి రంగిశెట్టివారి రామాలయం సమీపంలో గురువారం అర్ధరాత్రి అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ జానాసతీష్ తెలిపారు. హిజ్రాలతో అశ్లీల నృత్యాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారంతో దాడి చేసి నిర్వాహకులు రేలంగికి చెందిన పసుపులేటి కుమారస్వామి, పసుపులేటి రామాంజనేయులు, యర్రంశెట్టి రవి, షేక్ ఇస్మాయేలు, షేక్ ఖాదర్ అలియాస్ ఎండి ఖాదర్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. హిజ్రాలతోపాటు మరికొందరు వ్యక్తుల్ని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను దూర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శారదా సతీశ్ తెలిపారు. శుక్రవారం ఉదయం పెదపాడు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని, వాహనంలోని చికెన్ వేస్ట్‌ను స్వాధీనం చేసుకుని, వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు

పెరవలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి తణుకు కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధించింది. పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమంట్ర మండలం భట్లమగుటూరికి చెందిన మహాశివభట్టు లక్ష్మీనారాయణరాజు మద్యం సేవించి ఈ నెల 17న బైక్‌పై వస్తుండగా పెరవలి వద్ద పోలీసు తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా శిక్ష విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

బంధువు చనిపోయాడని ఊరెళితే.. రూ.4.5 లక్షల ఆభరణాలు దోచేశారు


కైకలూరులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బంధువు చనిపోయాడని ఊరెళితే ఇంటిని దోచేసిన ఘటన కైకలూరులో జరిగింది. శుక్రవారం కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. ఈనెల 6న కైకలూరు పట్టణంలోని వెలమపేటకు చెందిన జలగం శివశేష బంధువు చనిపోయారని తెలియడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో సహా ఊరికి వెళ్లాడు. తిరిగి ఈనెల 18న సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ.4.5 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు నిర్ధారించుకున్నారు. కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ పి.కృష్ణ, ఎస్ఐ ఆర్. శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఏలూరు నుంచి క్లూస్ టీం రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఛేదించేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు.

27 లీటర్ల సారా పట్టివేత.. ముగ్గురి అరెస్ట్


ముద్దాయిలతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ఏలూరు,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవాల ఆవులయ్య ఆదేశాల మేరకు చింతలపూడి సర్కిల్ పరిధిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సారా రవాణాపై దాడులను శుక్రవారం చేపట్టింది. ఈ దాడుల్లో సారా అమ్ముతున్న, రవాణా చేస్తున్న కరి పోతురాజు (వెలగపాడు), కలతోటి నాగేంద్ర(వెలగపాడు), ఇస్లావతు వెంకటేశ్వరరావు(రేచర్ల)లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 27 లీటర్లు సారాను, రవాణాకు ఉపయోగించే మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిం టెండెంట్ జి.పాండురంగారావు తెలిపారు. ఈ కేసుల్లో సారా కాయడానికి బెల్లం సప్లయ్ చేస్తున్న సరఫరాదారుడిని ఇన్‌వాల్ చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.సత్యవతి, ఎస్ఐ మహ్మద్ ఆరిఫ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్.. పాల్గొన్న అధికారులు

బాలలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):బాలలను విద్యా వంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం ఏలూరు జిల్లా న్యాయసేవాధికార భవనంలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ 'బాలల కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం' అంశంపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ప్యానల్ న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, విభిన్న ప్రతిభావంతుల శాఖ అదనపు డైరెక్టర్ రామ్‌కుమార్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల శిశు సంరక్షణ అధికారులు డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి, ఆర్.రాజేష్, మాస్టర్ ట్రైనర్ పి.రత్నరాజు, సీడబ్ల్యూసీ మెంబరు పి.వెంకటేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎండీ.పాషా స్పష్టంచేశారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని గురువారం సచివాలయంలో కలిసి ముందస్తు నోటీసు అందజేశారు. సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ల విధుల నుంచి విముక్తి కలిగించాలని, మాతృశాఖ, ఇతర శాఖల్లో విలీనం చేయాలని మంత్రిని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్లు ఒకే క్యాడర్‌లో పనిచేసిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించి పే స్కేల్ అమలు చేయాలని కోరారు.

ఉద్యోగులకు పాలనాపరంగా సమస్యలున్నాయా ?

ఏలూరు సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఉద్యోగుల పనితీరును ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. అన్ని సెక్షన్‌లలో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయో ఉద్యోగులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు పరిపాలనా పరంగా సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని ఆమె ప్రశ్నించారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, పలు విభాగాల ఏవోలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రైళ్లలో విస్తృత తనిఖీలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):రైళ్లలో గంజాయి రవాణా అవుతుందన్న సమాచారంతో ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీసు రవికృష్ణ ఆదేశాలతో ఆపరేషన్ విజయ్‌లో భాగంగా ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో శుక్రవారం వేకువజామున విశాఖ పట్టణం వైపు నుంచి వచ్చే రైళ్లను పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ బృందాలు, ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా ముందస్తుగా ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మెటల్ డిటెక్టర్లను వినియోగించారు. పోలీసు స్నిఫర్ డాగ్‌లతో తనిఖీలు నిర్వహించారు.


ఏలూరు రైల్వే స్టేషన్‌లో రైలులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

'యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి'

భీమడోలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి సూచించారు. పూళ్ళ గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వినియోగం, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాల ఆవశ్యకతను వివరించారు. రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు 'సమాచార హక్కు చట్టం'పై అవగాహన

చింతలపూడి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతునూరు సొసైటీ ఆవరణలో సమాచార హక్కు చట్టంపై చైర్‌పర్సన్ ఎస్.ఎస్.ఎన్.గాంధీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చి నేటికి 20 ఏళ్లు అయ్యిందని, ఎవరికైనా ఏ కార్యాలయంలోనైనా సమాచారం కావాలంటే కార్యాలయ ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు చేసి ఫీజు చెల్లిస్తే 30 రోజుల్లో సమాచారం అందిస్తారన్నారు. సొసైటీ డైరెక్టర్లు రాగం రాము, కె.వెంకటేశ్వరరావు, చీకటి రమేష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సాధికారతతోనే ఆర్థికాభివృద్ధి : చింతమనేని


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):రైతులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధిస్తేనే సామాజికాభివృద్ధి సాధ్యపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పలువురు రైతులు పలు సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్షిక పంటలతోపాటు ఉద్యాన పంటల సాగుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని, ఆయిల్‌పామ్, కొబ్బరి పంటల్లో అంతరంగా కోకో సాగు చేపట్టేందుకు రాయితీపై మొక్కల సరఫరాతోపాటు ఎరువులు, యంత్రాలను అందిస్తుందన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నాం : కమిషనర్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రజలందరికి ప్రతీరోజు రెండుపూటల స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్ అన్నారు. నగరంలో శుక్రవారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఆయన తాగునీటి నాణ్యత, శానిటేషన్ కార్యక్రమాలు, వాహనడిపోలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎప్పటి చెత్త అప్పుడే ఎత్తివేస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. చెత్త సేకరణ పాయింట్లను తనిఖీ చేశారు. శానిటేషన్ వాహనాలు సమయానికి చెత్తను తీసుకెళ్తున్నాయా లేదా అని ఆరా తీశారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి'

పెదవేగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పెదకడిమి గ్రామ సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణచౌదరి అన్నారు. పెదకడిమిలో శుక్రవారం జరిగిన 'పొలం బడి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తోందన్నారు. ఏలూరు డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. కొప్పాక సొసైటీ అధ్యక్షుడు కొసరాజు వరప్రసాద్, పెదవేగి ఏవో సీహెచ్.శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారి ఎం.రత్నమాల, రైతులు పాల్గొన్నారు.


మల్లుకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాస్వామ్యానికి 'సమాచార చట్టం' ప్రాణవాయువు

టి.నరసాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి సమాచార హక్కు చట్టం ప్రాణవాయువు వంటిదని సొసైటీ చైర్‌పర్సన్‌లు శీలం సాయి వినయ్, అడపా నాగరాజు తెలిపారు. మండలంలోని మల్లుకుంట, మధ్యాహ్నపు వారిగూడెం సహకార సంఘాల పరిధిలో నూజివీడు విభాగ సహకార అధికారి ఆదేశాల మేరకు ప్రజలకు సమాచార హక్కుచట్టం వినియోగంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించే ఆయుధం సమాచారహక్కు చట్టమని తెలిపారు. సీఈవోలు కేవీవీ సత్యనారాయణ, భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పనిచేయాలి : పీవో

బుట్టాయగూడెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి 'ఆది కర్మయోగి అభియాన్' కార్యక్రమం ఉపయోగపడుతుందని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేఆర్‌పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆది కర్మయోగి అభియాన్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పీవీటీజీ డివిజన్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది, సీనియర్ కన్సల్టెంట్ స్వాతి బాత్రా పాల్గొని ఆది కర్మయోగి అభియాన్ అమలు, గ్రామస్థాయి భాగస్వామ్యం, సామర్థ్యం, వృద్ధి తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఎంపీడీవోలు, జిల్లా, బ్లాక్, విలేజ్ మాస్టర్ ట్రైనీలు పాల్గొని గిరిజన గ్రామాల అభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేయడానికి చర్యలు చేపట్టారు.

'ఎల్‌డీ పట్టా భూములకు రుణాలు ఇవ్వండి'

చింతలపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌డీ పట్టా భూములకు (భూమి అభివృద్ధి) సొసైటీల్లో రుణ సౌకర్యం కల్పించాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును కలిశామని ఎర్రంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ తాళ్ళూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. 1983కు పూర్వం రైతుల సాగులో ఉన్న అసైన్డ్ భూములకు ఎన్టీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత వీరికి భూమి అభివృద్ధి ఎల్‌డీ పట్టాలు ఇచ్చి, సొసైటీల్లో రుణాలు పొందే సౌకర్యం కల్పించారన్నారు. 2005లో వైఎస్‌ఆర్ హయాంలో రుణాలు ఇచ్చే విధానం రద్దు చేశారు. అప్పటి నుంచి వాణిజ్య బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించి తిరిగి రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.

పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

దెందులూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, తడి-పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ అన్నారు.శుక్రవారం గోపన్నపాలెం గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించి పారిశుధ్యకార్మికులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి స్టాలిన్‌బాబును చెత్త సేకరణపై వివరాలు అడిగితెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో భీమరాజు, సిబ్బంది ఉన్నారు.

మినీ అంగన్‌వాడీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలి

కుక్కునూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కుక్కునూరు ప్రాజెక్టు సీడీపీవోకి వినతిపత్రం అందజేశారు. బాడిస సుజాత, పచ్చా మంగా, కారం వందన, పున్నమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

పోలవరం, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి అండర్-14,17 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు ఎల్.సత్యన్నారాయణ, వి.సూర్యనారాయణమూర్తి, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఫిజికల్ డైరెక్టర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టార్గెట్..చైర్మన్ పీఠం !

(5వ పేజీ తరువాయి)

చూడాలని, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలని కోరారు. మునిసిపాలిటీ ఇంజినీరింగ్ సెక్షన్‌లో జీతాలు తీసుకుంటూ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, హెల్త్ సెక్షన్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో పని చేయడం నిబంధనలకు విరుద్ధమని, తక్షణమే ఆ సిబ్బందిని ఇంజనీరింగ్ సెక్షన్‌లోకి మార్చి ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ముత్యాల కామేష్, మొమ్మలనేని సునీల్ కుమార్, బండారు శివ, తోట శోభనం, చెలికాని సాయి, నాయుడు శ్రీనివాసు, లక్ష్మి శ్రీనివాస్, రామిశెట్టి తేజశ్విని తదితరులు ఉన్నారు.

నిధులకు.. గ్రహణం !

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ జిల్లాలో పెనుమంట్ర- వీరవాసరం ప్రధాన రోడ్డు 1.66 కిమీ, కానూరు- లంకలకోడేరు 2.16 కిమీ, మేడపాడు -నరసాపురం ప్రధాన రోడ్డు కొంత కుదించి పనులను కాంట్రాక్టర్ పూర్తి చేశారు.

'నిధులు విడుదల లేకపోవడంతో పనులు కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఈ మేరకు పెండింగ్ బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించాం. ఈ సమస్యపై కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పనులు త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడతాం' అని ఏలూరు సర్కిల్ ఎస్ఈ కె.విజయత్నం తెలిపారు.


ఏలూరు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు


ఏలూరులో మునిసిపల్ అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు


భీమడోలు సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

నిరసనలు

» విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు
» వీఆర్‌ఏల ఆందోళనలు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విద్యుత్ భవన్ వద్ద ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ భూక్యా నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 35వేల మంది పర్మినెంట్, 26వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1999 తరువాత చేరిన ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. జేఏసీ చైర్మన్ ఎం.రమేశ్, జిల్లా కన్వీనర్ వి.రాము మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 22న శాంతిర్యాలీ నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం తురగ రామకృష్ణ మాట్లాడారు. ఎస్‌డీ అబ్బాస్, ఎ.సంజీవ్, కె.గంగాధర్, తారాసింగ్ నాయక్, అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల నిరసన

దెందులూరు : గ్రామ రెవెన్యూ సహాయకులను ప్రతి పనికి వాడుకోవడం చాలా దారుణమని వీఆర్‌ఏల సంఘం మండల అధ్య క్షుడు గిరిబాబు, ఉపాధ్యక్షుడు నిట్టా రాజు అన్నారు. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం నేరవేర్చాలని. రూ.21 వేల వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రెవెన్యూ సహాయ కుల సంఘం నాయకులు జె.ప్రియ, మాగంటి రాధ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

ఏలూరుకార్పొరేషన్ : పన్నెండో పీఆర్సీ ప్రకారం మునిసిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులు పది రోజులు, పారిశుధ్య కార్మికులకు ఏడు రోజులు సమ్మె కాలపు జీతాలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డి.ఎన్.వి.డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు జె.గోపి, ఎం.ఇస్సాకు, అరుణ, కుమారి ఉన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

భీమడోలు/పెదపాడు:ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్, ఓటీపీ విధానాలను రద్దు చేయాలంటూ భీమడోలు దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేపట్టారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు భీమడోలు దస్తావేజు లేఖర్లు, పెదపాడు మండలం వట్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖర్లు ఈనెల 19, 20 తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా ఆర్గనైజింగ్ కార్య దర్శి నండూరి శ్రీరామ్, భీమడోలు సంఘ అధ్యక్షుడు వెజ్జు నాగేశ్వరరావు, కార్యదర్శి వర్తినీడి రాము, బాలనాగు వెంకటేశ్వరరావు, పెదపాడులో లేఖరులు జయ గీతాకృష్ణ, శేషగిరిరావు, జయసుధ, జ్యోతి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

» జిల్లా ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ కిశోర్ అన్నారు. ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సివిల్ పోలీస్, ఏఆర్ పోలీస్, హోంగార్డులు మొత్తం 30 మంది సమస్యలను ఎస్పీకి తెలియజేశారు. వాటిని సత్వర పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

'సామాజిక సేవలో రక్షణ సైన్యం'

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు సువార్త సేవతో పాటు సామాజిక సేవ కూడా రక్షణ సైన్యం చేస్తుందని చర్చి సంఘ కాపరి కెప్టెన్ నీలారత్నకుమార్ అన్నారు. రక్షణ సైన్యం 143వ వార్షికోత్సవం మిలినియం చర్చిలో శుక్రవారం నిర్వహించారు. మేజర్ డి.ఏసురత్నం దేవుని వాక్యాన్ని అందించారు. సంఘ పెద్దలు, యవ్వనస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా కళాశాలలో చర్చాగోష్ఠి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో 'మానవ మనుగడ-జీవవైవిధ్యం' అంశంపై డిగ్రీ, పీజీ జువాలజీ, హోంసైన్సు విద్యార్థినులకు చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవజీవితం ప్రకృతితో మమేకమై సాగాలని, సృష్టిలోని సకలజీవులకు ఆధారమైన ధరిత్రిని, ప్రకృతిని సంరక్షించడం మన కర్తవ్యమని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ పేర్కొన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీలత, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, సిస్టర్ సుశీల పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

చింతలపూడి/ఉంగుటూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలని ఎమ్మెల్సీ గోపిమూర్తి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రణభేరి జాత నిరసన ర్యాలీ ఉంగుటూరు మండలం నారాయణపురం నుంచి చింతలపూడి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సుమారు 300 మంది పాల్గొన్నారు. అనంతరం రణభేరి బైక్ ర్యాలీ భీమడోలు మీదుగా ద్వారకాతిరుమల వైపు సాగింది. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుసుమకుమారి, సుభాషిణి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ముస్తఫా ఆలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సృజనాత్మక ఆలోచనలు ఆవిష్కరించాలి'

పెదపాడు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):ఇంజనీరింగ్ విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన నూతన ఆలోచనలు ఆవిష్కరించాలని వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఐఐసీ చైర్మన్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల అంతర్గత స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 కార్యక్రమాన్ని శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హ్యాకథాన్ కన్వీనర్ డాక్టరు ఎం.వీరకుమారి మాట్లాడుతూ హ్యాకథాన్‌లో మొత్తం 570 మంది విద్యార్థులు 95 జట్లుగా పాల్గొన్నాయి. వీటిలో అత్యుత్తమ పది ఆలోచనలు సమగ్ర నివేదికలతో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, మేనేజ్‌మెంట్ మెంబరు కొండా హరిరామకృష్ణంరాజు, డాక్టరు ఐ.హేమలత, డాక్టరు పి.నాగదీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో స్కూల్ బస్సులు, వాహనాలను తనిఖీ చేశారు. విద్యార్థులను ఎక్కించుకునే వాహనాలు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్‌గా ఉండాలని లేదంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. హోలీట్రినిటీ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సుకు బ్రేక్, పర్మిట్ సర్టిఫికెట్ గడువు ముగిసినా వాహనాన్ని నడపడంతో రూ.15వేల జరిమానా విధించినట్టు తెలిపారు. లింగపాలెంలో ఎస్‌ఐ కె. వెంకన్న ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేసి పలువురికి జరిమానా విధించారు. తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలి

» ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి

లింగపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీరు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కె.వాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. పలు శాఖల అధికారులు తమ శాఖా పరమైన అంశాలను చదివి వినిపించారు. మండలంలో ఇరవై గ్రామ పంచాయతీలు ఉండగా సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాలేదు.


కామవరపుకోటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి


దెందులూరులో స్వస్థ్ నారీ -సశక్త్ పరివార్‌ను ప్రారంభించిన కలపాల శ్రీహరి, డాక్టర్ సుందరబాబు

'ప్రతి మహిళ ఆరోగ్యంతో కూడిన దృఢత్వాన్ని పొందాలి'

పెదపాడు/దెందులూరు/పెదవేగి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన దృఢత్వాన్ని పొందాలని దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత తెలిపారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పేరిట మహిళల కోసం వైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ రామసీత, అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. దెందులూరు మండలం దెందులూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కలపాల శ్రీహరి, సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహాయ సహకారాలతో దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రిని నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సర్పంచ్ యేసమ్మ, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌యాదవ్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు సంపెంగ వేణుగోపాలతిలక్, నీటి సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొల్లిపర వేణు భాస్కరరావు, షేక్ జహీర్, వైద్యులు పాల్గొన్నారు. పెదవేగి మండలం కె.కన్నాపురం గ్రామ సర్పంచ్ ఈడ్పుగంటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ రమేష్‌బాబు, పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి/కామవరపుకోట : చింతలపూడి నగర పంచాయతీలోని సుప్రియన్‌పేటలో 175 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సొంగా యేసుపాదం ప్రారంభించారు. కామవరపుకోట మండలం కామవరపుకోట, ఆడమిల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు ఉచితంగా పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కోనేరు వెంకట సుబ్బారావు, కిలారు సత్యనారాయణ, ఘంటా మాధవరావు, సర్పంచ్‌లు కరిపోతు అనూష, గూడపాటి కేశవరావు, వైద్యులు పాల్గొన్నారు.

● నిడమర్రు/భీమడోలు : నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామంలో సర్పంచ్ తుమ్మూరి నారాయణమ్మ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 200మంది మహిళలకు పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. భీమడోలు మండలం గుండుగొలను పీహెచ్‌సీలో వైద్యులు రాజేంద్ర జాహ్నవిరెడ్డి, శరణ్య తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ.. పేద విద్యార్థులకు నష్టమే'

ఏలూరు క్రైం/ఏలూరు టూటౌన్/పోలవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు నష్టపోతారని వైసీపీ నాయకులు అన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని ఏలూరులో నిర్వహించడానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్, పార్లమెం టు ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుప్పాల వాసుబాబు, పోలవరం ఇన్‌ఛార్జి తెల్లం బాలరాజు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు పలువురు విద్యార్థులు, యువకులు కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏలూరు వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బం దులు కలగకూడదని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యాలయం నుంచి వారంతా రావడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ పోలీసులు అడ్డుకున్నారు. చివరకు వారి కార్యాలయం సమీపంలోని తమ ధర్నా నిర్వహించారు. ఈ విధంగా వైసీపీ నాయకులు మెడికల్ కళాశాల వద్ద తలపెట్టిన ధర్నాను పోలీసులు విఫలం చేశారు.

కాలేజీలపై రాద్ధాంతం వద్దు : టీడీపీ

మెడికల్ కళాశాలల విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న రాద్ధాంతాలను కట్టిపెట్టాలని టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైద్యకళాశాలలపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టే యత్నంలో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం మాట్లాడుతూ వైద్య కళాశాలలను అసంపూర్తిగా నిర్మాణాలు చేసి సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మహిళా అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి మాట్లాడారు. నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు సాగుపై ఎస్సీ రైతులకు అవగాహన

జీలుగుమిల్లి, సెప్టెంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : వర్జీనియా పొగాకు సాగులో మేలు రకాల వంగడాలు ఉపయోగిస్తే మంచి దిగుబడులు వస్తాయని సీటీఆర్ఐ హెడ్ వైవీ.సుబ్బారావు అన్నారు. ఐకార్-ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ ఆదేశాలతో పొగాకు రైతుల ఆదాయం పెంచడానికి ఎస్సీ రైతులకు అవగాహన కల్పించారు. ఎస్సీ రైతులకు నారు పెంపకానికి ఉపయోగించే ప్లాస్టిక్ ట్రేలను అందజేశారు. వంద మంది రైతులక ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో ఉపయోగపడే 11 రకం పొగాకు విత్తనాలను ట్రేలు ఉచితంగా అందజేశారు. టి.రమేష్, ఎ.ప్రభు, జి.శ్రీనివాస రావు, జీఎస్ఎం అన్నపూర్ణ, బి.దుర్గారావు, టి.శ్రీనివాసరావు, ఇ.వీరభద్రరావు ఉన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయని ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు .శుక్రవారం స్వామివారి ఆలయంలో పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర ప్రోక్షణ, పవిత్ర అవరోహణ, శాంతి కల్యాణము తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా రుత్విక్ స్వాములను దేవస్థాన ఈవో కలగర శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, దండు ధనరాజు, వాసవీసాయి నగేశ్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

జోగన్నపాలెం సొసైటీలో 3 వేల మంది ఖాతాదారులు

డాక్టర్ పసుమర్తి మధుబాబు
జోగన్నపాలెం సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు



- **జోగన్నపాలెం సొసైటీ బ్యాంక్ పరిధిలో ఎన్ని గ్రామాలు ?**

జవాబు: సొసైటీ పరిధిలో రామారావుగూడెం, శ్రీరామవరం, మేదినరావుపాలెం, జోగన్నపాలెం గ్రామాల్లో మూడు వేల మంది రైతులు ఉన్నారు.

- **రైతులకు రుణాల పరిస్థితి ఏంటి ?**

జవాబు : సొసైటీ పరిధిలో రూ.40 కోట్ల రూపాయల టర్నోవర్ ఉంది.ఈ ఏడాది రూ.4 కోట్లపైగా రుణాలు అందించాం.

- **రైతులకు యూరియా కొరత ఉందా ?**

జవాబు : ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో యూరియా పుష్కలంగా అందించాం. ఇప్పటికీ అందుబాటులో ఉంది.

- **ఫిక్స్‌డ్ డిపాజిట్ ఎంత ఉన్నాయి ?**

జవాబు : రూ. 4 కోట్ల వరకు.

- **మీ లక్ష్యం ఏంటి**

జవాబు : ఉత్తమ సొసైటిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

- **రైతులకు మీరిచ్చే సలహా ?**

జవాబు : తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి.

(ఆంధ్రజ్యోతి-దెందులూరు)

హాస్టళ్లలో కలెక్టర్ తనిఖీ

ఏలూరు,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో అమీనాపేటలో ప్రభుత్వ బాలికల హాస్టళ్లను కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆరా తీశారు. వసతి గృహాల ఆవరణ, పరిసరాల్లో ఫాగింగ్ చేయించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. స్టడీ అవర్స్‌లో బోధనా సిబ్బంది, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి, ఉత్తీర్ణతా శాతం పెంచేలా చూడాలన్నారు. హాస్టళ్లను తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తానని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ వై.విశ్వమోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి పాల్గొన్నారు.

చింతలపూడి సబ్ జైలు తనిఖీ

చింతలపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు శుక్రవారం తనిఖీ జరిపారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందుతున్న ఆహారం, మంచినీరు, వైద్య సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయం కావాలంటే తెలియజేయాలన్నారు. వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ కృపానందం, ప్యానల్ న్యాయవాదులు విజయరావు, నాగార్జునసాగర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు కొనసాగించే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సాంబశివరావు తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన అర్జీపై అధికారులు సమాధానం ఇచ్చారు. నల్లదిబ్బ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పక్కా ఇళ్లు నిర్మించిన వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

భారీ అన్న సమారాధన

పోలవరం, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో శుక్రవారం శ్రీ చైతన్య ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవ రాత్రుల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. సుమారు ఐదు వేల మందికిపైగా పాల్గొన్నారు. ఆటో యూనియన్ నాయకులు సభ్యులు తాళ్ళపూడి చంద్రరావు, షెహిన్నా, నాగరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రహదారుల పక్కన ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు ప్రక్రియ నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం నగరంలోని ఏడు కాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారివీధి, కబేల ఏరియా, తూర్పువీధి శివాలయం, సాయిబాబా గుడి, ప్రేమాలయం రోడ్డు, పెదమాలపల్లి, తూర్పువీధి గంగానమ్మ గుడి, ఫిల్‌హౌస్‌పేట, చాటపర్రు రోడ్డు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారి కె.ఎం.అంబేద్కర్ తెలిపారు.

● జీలుగుమిల్లి: చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

● పెదపాడు : పెదపాడు మండలం, పెదపాడు సెక్షన్, ఆర్‌పీపాలెం, వీరమ్మకుంట ఇండస్ట్రియల్ ఫీడర్, ఏపూరు సబ్‌స్టేషన్ సెక్షన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మతుల నిమిత్తం ఆర్పీపాలెం, సత్యవోలు, పాతముప్పర్రు, జయపురం, వీరమ్మకుంట, అప్పనవీడు, ఏపూరు మరియు తాళ్ళమూడి, పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ శంకరం తెలిపారు.

వికసిత్ భారత్‌పై విద్యార్థులకు పోటీలు

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడానికి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీలత తెలిపారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్-2047లో భాగంగా సేవా పర్వ్ 2025 కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం హరిప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు గీత కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లు గీత కార్మికులకు నూతన కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల పరిధిలో 104 మంది కల్లుగీత కార్మికులుగా నూతనంగా నమోదు చేసుకున్నారన్నారు. వీరికి శనివారం మంత్రి పార్థసారథి చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందించనున్నట్లు తెలిపారు.

ఈ నీరు తాగలేం!

ఫిల్టర్‌బెడ్స్‌లో మొలకెత్తిన జమ్ము, పిచ్చి మొక్కలు!

ఆంధ్రజ్యోతి పరిశీలన



కైకలూరు ఫిల్టర్ బెడ్స్‌లో దట్టంగా మొలిచిన జమ్ము

రక్షిత నీటి పథకాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉంది. తాగునీరు పసర్లు తేలితే ఫిల్టర్ బెడ్‌లలో దట్టంగా పెరిగిన గడ్డి పాలకులు, అధికారుల నిర్లక్ష్యాన్ని పట్టిచూపుతోంది. పైపులైన్ లీకేజీలతో నీరు వృథాగా పోతుంటే సామాన్యులు తాగే కొద్దిపాటి నీరు మురుగు నీటితో కలుషితమవుతోంది.

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రక్షిత నీటి పథకాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వైసీపీ పాలనలో రక్షిత నీటి పథకాలకు ఒక్క ఫిల్టర్‌బెడ్ నిర్మాణం చేయకపోగా ఉన్నవాటిని మరమ్మతు చేయలేదు. దీంతో ప్రజలకు కాలువల్లో నీటినే నేరుగా సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టినప్పటికీ నిధుల లేమి వెన్నాడుతోంది.

కైకలూరు మండలంలో సుమారు 18 గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్స్ పడకేశాయి. కైకలూరులో 6 ఫిల్టర్‌బెడ్స్ నోచుకోకపోవడంతో మరుగున పడ్డాయి. రూ.1.9 లక్షలతో నిర్మాణం చేసిన ర్యాపిడ్ శాండ్‌ఫిల్టర్ పనిచేయక పోవడంతో నేరు గా నీటిని విడుదల చేస్తున్నారు. ఆటపాక, భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు, సీతనపల్లి, వరహా పట్నం, రాచపట్నం, గోపవరం తదితర గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది. ఫిల్టర్‌బెడ్స్‌ను వినియోగించకపోవడంతో వాటిలో పిచ్చిమొక్క లు, జమ్ము దట్టంగా పెరిగిపోయాయి. పంచాయతీ అధికారులు సైతం కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపా దనలు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించినా నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు శుద్ధి కాని జలాలనే వినియోగించు కోవాల్సి వస్తోంది.

కలిదిండిలో 15 బెడ్‌లకు మరమ్మతులు

కలిదిండి: మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 25 రక్షిత నీటి పథకాలున్నాయి. 15 రక్షిత నీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. తాగునీరు ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయిలకు వదులుతున్నారు. ఈ నీరు తాగలేక ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. మూల్లంక రక్షిత నీటి పథకం ఫిల్టర్‌బెడ్‌ల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చెత్తాతో పూడిపోయాయి. ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు చేసి సురక్షిత వాటర్ అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుమాకలంకలో పనిచేయని ఫిల్టర్ బెడ్స్

మండవల్లి: మండలంలోని పెనుమా కలంకలో నాలుగేళ్ల క్రితమే ఫిల్టర్‌బెడ్లు పాడైపోయాయి. చెరువులో నీరు రంగు మారి మురుగు వాసన కొడుతున్నా శుద్ధి చేయకుండా విడుదల చేస్తున్నారు. 2 వేల జనాభా కలిగిన గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఫిల్టర్‌బెడ్‌లతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకులు కూడా శిథిలావస్థకు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారు.

ముదినేపల్లిలో ఒక్క నీటి పథకం పని చేస్తే ఒట్టు!

ముదినేపల్లి: మండలంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. మండలంలోని 32 గ్రామ పంచాయ తీల్లో 36 రక్షిత నీటి సరఫరా పథకాలున్నాయి. ఒక్క పథకం ద్వారా కూడా తాగునీటి సరఫరా జరగడం లేదు. ఫిల్టర్ బెడ్ల నిర్వహణ లేకపోవడంతో శుద్ధి చేయని నీటిని సరఫరా చేస్తున్నారు. నిధుల కొరత వల్ల నీటి పథకాలను పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోతున్నామని సర్పంచ్‌లు చెబు తుండగా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రం. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శిథిలమవుతున్నా పట్టించుకోవడం లేదు. నాంది ఫౌం డేషన్ గతంలో ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్లు కూడా మూల పడ్డాయి. ముదినేపల్లిలో శిథిలమైన ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు.



మూల్లంక ఫిల్టర్ బెడ్‌లో దట్టంగా పిచ్చిమొక్కలు

ముసునూరులో కలుషిత నీరే దిక్కు!

ముసునూరు: మండలంలో తాగునీటి సరఫరా ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. బీటలు వారి, పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గోపవరం, గోగులంపాడు, యల్లాపురం, ముసునూరు, రమణక్కపేట ట్యాంకులను సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించారు. ట్యాంకులు, స్తంభాలు పెచ్చులూడి ఐరన్ బయటపడింది. ట్యాంకుల పైకి మెట్లు ధ్వంసమయ్యాయి. ట్యాంక్‌ల నుంచి వచ్చే కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది. శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను తొలగించి కొత్త ట్యాంక్‌ల నిర్మాణాలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉప్పుటేరు వెంబడి భూములను ఆక్రమిస్తే చర్యలు

కలిదిండి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వెంబడి భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం కలిదిండి మండలం చినతాడినాడలో ఉప్పుటేరు వద్ద హెచ్చరిక బోర్డును రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరు వెంబడి ఉన్న అక్రమ చేపల, రొయ్యల చెరువులను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నామన్నారు. కొందరు తొలగించిన చెరువులకు మళ్లీ గట్లు వేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉప్పుటేరు ప్రక్షాళన పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

స.హ. చట్టం.. ప్రజాస్వామానికి ఆక్సిజన్

నూజివీడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్‌లా పనిచేస్తుందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ చావలి సునీల్ అన్నారు. శుక్రవారం నూజివీడు సహకార శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరులో పారదర్శకత తెలుసుకోవడానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో గల 52 సహకార సంఘాల్లో సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను తెలియచేస్తూ ప్రతి సహకార సంఘం సీఈవో, ఉద్యోగులు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలని కోరారు. సదస్సు అనంతరం సహకార ఉద్యోగులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.పద్మశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కలిదిండి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. శుక్రవారం చినతాడినాడలో మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదరణ పథకం కింద మత్స్యకారులకు వలలు, నాటు పడవలు, ఎలక్ట్రిక్ వాహనాలు సబ్సిడీపై త్వరలో పంపిణీ చేస్తామన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛన్ అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు సొర్రా అరవింద్, టీడీపీ నాయకులు మోకా వెంకటేశ్వరరావు, కొల్లాటి శ్రీను, సంగాని రామకృష్ణ, కొల్లాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ పురస్కారం వచ్చేలా కృషి చేయాలి

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. శుక్రవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనందున గ్రామాల్లో తాగునీటి అవసరాలకు కావాల్సిన పనులను తక్షణమే చేపట్టాలని అలాగే ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రణాళికాబద్ధంగా పనులను నిర్వహించి గ్రామాలకు ఉత్తమ పురస్కారాలు వచ్చేలా చూడాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి: ఏఐఎస్ఎఫ్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖామంత్రి స్పందించి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రాన్ని అందించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ముసునూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోషక విలువతో కూడిన ఆహారం ఆరోగ్యానికి శ్రేయస్కరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జాస్తి జగన్‌మోహనరావు అన్నారు. రాష్ట్రీయ పోషణ మహోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాట్రేనిపాడులో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఆయన సందర్శించి మాట్లాడుతూ పోషకాహారంతో వ్యాధినిరోధక శక్తి పెరిగి, అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

చాట్రాయి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులంతా చైతన్యంతో ప్రకృతి వ్యవసాయం చేపడితే ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి గొప్ప మేలు జరుగుతుందని ఏవో శివశంకర్ పేర్కొన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా చాట్రాయి దీపచెరువు ఆయకట్టులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అధికంగా వాడటం వల్ల పంటలకు అవసరమయ్యే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన

నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో ఓటీపీ విధానానికి స్వస్తిచెప్పి దస్తావేజు లేఖర్లకు లైసెన్సులు మంజూరు చేయాలని, దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు మహ్మద్ అలీ అబ్బాస్ డిమాండ్ చేశారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల యూనియన్ ఆధ్వర్యంలో పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నమ్ముకుని లక్షలాది మంది దస్తావేజు లేఖర్లుగా కుటుంబ పోషణ చేసుకుంటున్నారన్నారు. అలాంటి దస్తావేజు లేఖర్లకు ఉపాధిని మెరుగుపరుస్తూ పర్మినెంట్ లైసెన్సులను మంజూరు చేయాలని, రిజిస్ట్రేషన్ విధానంలో ఓటీపీ పద్ధతిని రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వజీద్ ఖాన్, ప్రభుకుమార్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



మండవల్లిలో పాఠశాల ఆవరణ పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

పాఠశాలలను పరిశీలించిన సమగ్ర శిక్ష అధికారులు

మండవల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండవల్లిలోని మోడల్ ప్రైమరీ స్కూల్ మండవల్లి-2, మండవల్లి-1 పాఠశాలలను జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అడిషనల్ కో-ఆర్డినేటర్ కె. పంకజ్‌కుమార్, జిల్లా సమగ్ర శిక్ష ఈఈ పి. రమణకుమారి శుక్రవారం పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పాఠశాల ప్రహరీ తొలగించడంతో పునర్నిర్మాణానికి అధికారులు పరిశీలించారు. త్వరలోనే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ-1 సీహెచ్ సురేష్, ఎంఈఓ-2 ఎస్. రత్నసునాదం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిషోర్, హెచ్‌ఎంలు పి. నిర్మలకుమారి, ఎ. ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.



కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు



ముదినేపల్లిలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వీఆర్‌ఏలు

వీఆర్‌ఏల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏలు) తమ జీతాలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రభుత్వం ఇచ్చే జీతం సరిపోవడం లేదని దీనికి తోడు పనిభారం ఎక్కువై మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు బి. రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ కె. ప్రేమ్‌చంద్, సంఘ సభ్యులు బాబి, కె మల్లిక, అశ్లేష, శిరీష, అనిత తదితరులు పాల్గొన్నారు.

ముదినేపలి: ముదినేపల్లిలో శుక్రవారం వీఆర్‌ఏలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మండల వీఆర్‌ఏల సంఘ నాయకులు సురేష్, రాజేష్, నూర్జహన్, సునీ, శివపార్వతీ, బలరామ్ తదితరుల నాయకత్వంలో వీఆర్‌ఏలు ప్ల కార్డులు ప్రదర్శించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు కల్పించాలి, వీఆర్‌ఏలకు పే స్కేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ లతీఫ్ పాషాకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.



ఎల్‌వోసీ అందజేసిన మంత్రి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతోందని, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన జి.సమాధానం చికిత్సకు ఆమె కుటుంబీకులకు రూ.50 వేల ఎల్‌వోసీని, నూజివీడు మున్సిపల్ పరిధిలోని శ్రీహర్ష వైద్య ఖర్చుల నిమిత్తం రూ.60 వేల ఎల్‌వోసీని ఆయన బాధిత కుటుంబానికి అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చిగురుకోట 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు

ముసునూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మంత్రి పార్థసారథి ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ దాసరి ప్రశాంతి అన్నారు. శుక్రవారం గుళ్ళపూడిలో రెవెన్యూ సమస్యలపై ఆమె గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదారు పాసు పుస్తకాల మ్యుటేషన్, సర్వే, ఆన్‌లైన్‌లో తేడాలు తదితర సమస్యలపై 18 మంది రైతులు తహసీల్దార్‌కు అర్జీలను అందజేశారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు మందలపు ధర్మరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్లి కృష్ణయ్య, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వో శారద తదితరులు పాల్గొన్నారు.

కచ్చా డ్రెయిన్ల పూడికతీత

చాట్రాయి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో సర్పంచ్ ఓబిశ్శనేని సరోజిని ఆధ్వర్యంలో రహదారుల వెంట కచ్చా డ్రెయిన్ల పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. డ్రెయిన్లలో పూడిక పేరుకు పోయి వర్షం రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో కచ్చా డ్రెయిన్లు పూడిక తీసి వర్షం నీరు బయటకు వెళ్ళేలా పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ చెప్పారు.



చాట్రాయిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లాలి ఆరోగ్యం.. ఇంటికి సౌభాగ్యం

చాట్రాయి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇల్లాలి ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం అని, ఇది దేశ భవిష్యత్తును కూడా నిర్దేశిస్తుందని వక్తలు పేర్కొన్నారు. చాట్రాయి పీహెచ్‌సీ, చిత్తపూరు-2 సచివాలయంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, పోషకాహారం, పలు వ్యాధులకు చికిత్సపై నిపుణులతో అవగాహన కల్పించి, ప్రజలతో ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జ్యోతి, యునానీ డాక్టర్ శశికళ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ నిర్వహించి సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. చాట్రాయిలో మహిళలు 94 మంది, పురుషులు 19 మంది, చిత్తపూరు-2లో మహిళలు 107 మంది, పురుషులు 36 మందికి వైద్య సేవలు అందించగా, చిత్తపూరులో ఒక రొమ్ము క్యాన్సర్ పేషెంట్‌ని జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం కాట్రేనిపాడులో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ షకీనా ఇవాంజలి 188 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.జగన్మోహనరావు తనిఖీచేశారు. ఎంపీహెచ్ఎస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలో మహిళలకు క్యాన్సర్‌స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లను ముందుగా గుర్తించటం వల్ల వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ నగ్మ, డాక్టర్ హెలీనా దాదాపు 266 మందికి పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. మోనటరింగ్ ఆఫీసర్ కె.నరేంద్రకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

150 మంది మహిళలకు వైద్య పరీక్షలు

ముదినేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరులో శుక్రవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ పథకంలో గురజ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మందికి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాణి శిరీషాబాయి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రుతు క్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించటంతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ శీలం రామకృష్ణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, బీజేపీ నాయకురాలు రెడ్డి రాధిక తదితరులు పాల్గొన్నారు. మండలంలో ఈ నెల 20న బొమ్మినంపాడు, 22న వణుదుర్రు, 23న పెద గొన్నూరు, 24న పేరూరు, 25న పెదపాలపర్రు, 26న ఊటుకూరు, 27న కొర్రగుంటపాలెం, 29న వైవాక, అక్టోబరు 1న పెనుమల్లి, చిగురుకోట గ్రామా ల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.



కాట్రేనిపాడులో ఐసీడీయస్ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కలిదిండి: మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ మండల అధ్యక్షుడు అంకాల దుర్గా ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరు రవీంద్ర అన్నారు. శుక్రవారం కోరుకొల్లులో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. కోరుకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఉస్మాన్, సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, మాజీ ఎంపీపీ వి.రామారావు, నీటి సంఘం అధ్యక్షులు కేశిరెడ్డి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆటల పోటీలు ప్రారంభం

ముదినేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల స్థాయి బాలికల ఆటల పోటీలు శుక్రవారం స్థానిక వికాస్ కళాశాలలో ఎంఈవో-2 కె నరేష్‌కుమార్ ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర ఆటల పోటీలను అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముదినేపల్లి హైస్కూలు హెచ్‌ఎం విజయకుమార్, పీడీలు భాస్కర్, శ్రీనివాసరావు, వికాస్ కళాశాల కరస్పాండెంట్ మదన్ కిషోర్, ప్రిన్సిపాల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్.. చైర్మన్ పీఠం!

(5వ పేజీ తరువాయి)

చూడాలని, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చూడాలని కోరారు. మునిసిపాలిటీ ఇంజినీరింగ్ సెక్షన్‌లో జీతాలు తీసుకుంటూ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, హెల్త్ సెక్షన్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో పని చేయడం నిబంధనలకు విరుద్ధమని, తక్షణమే ఆ సిబ్బందిని ఇంజనీరింగ్ సెక్షన్‌లోకి మార్చి ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ముత్యాల కామేష్, మొమ్మలనేని సునీల్ కుమార్, బండారు శివ, తోట శోభనం, చెలికాని సాయి, నాయుడు శ్రీనివాసు, లక్ష్మీ శ్రీనివాస్, రామిశెట్టి తేజశ్విని తదితరులు ఉన్నారు.

నిధులకు.. గ్రహణం!

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ జిల్లాలో పెనుమంత్ర- వీరవాసరం ప్రధాన రోడ్డు 1.66 కిమీ, కానూరు- లంకలకోడేరు 2.16 కిమీ, మేడపాడు -నరసాపురం ప్రధాన రోడ్డు కొంత కుదించి పనులను కాంట్రాక్టర్ పూర్తి చేశారు. 'నిధులు విడుదల లేకపోవడంతో పనులు కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఈ మేరకు పెండింగ్ బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించాం. ఈ సమస్యపై కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పనులు త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడతాం' అని ఏలూరు సర్కిల్ ఎస్ఈ కె.విజయత్నం తెలిపారు.



నూజివీడు విక్టోరియా టౌన్ హాలు గ్రౌండ్‌లో నిరసన చేపట్టిన క్రీడాకారులు

శాప్ నిర్లక్ష్యం.. ఉన్నత చదువుకు దూరం

జెన్యూనెస్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ట్రిపుల్ ఐటీ సీట్లు కోల్పోతున్న క్రీడాకారులు

నూజివీడులో నిరసన చేపట్టిన బాధితులు

మంత్రులు పట్టించుకోవాలని వేడుకోలు..

(నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి)

క్రీడాకారుల ప్రయోజనాన్ని కాపాడాల్సిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నూజివీడుకు చెందిన బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి క్రీడాకారులు తమ అవకాశాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 10వ తరగతి తరువాత ట్రిపుల్ ఐటీ సాధించటం విద్యార్థుల కల. గ్రామీణ స్థాయి విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్జీయూకేటీలో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌కు సంబంధించి స్పోర్ట్స్ కోటా కింద నూజివీడుకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు అర్జీ దాఖలు చేశారు. అండర్-14 నుంచి సీనియర్స్ వరకు ఈ విద్యార్థినులు జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొన్నారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఆర్జీయూకేటీలో అడ్మిషన్లకు అర్జీ దాఖలు చేశారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్లకు సంబంధించి జన్యూనెస్ సర్టిఫికెట్‌ను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారులు నిర్ధారించాల్సి ఉంది. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జన్యూనెస్ సర్టిఫికెట్స్‌ను శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)కు పంపినా సంబంధిత సర్టిఫికెట్లను ట్రిపుల్ ఐటీకి జారీ చేయటంలో తీవ్ర నిర్లక్ష్యం ఏర్పడింది. ఫలితంగా ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నూజివీడుకు చెందిన క్రీడాకారులకు అవకాశం లభించలేదు. మరోసారి జన్యూనెస్ సర్టిఫికెట్లను దాఖలు చేయాలని ఆర్జీయూకేటీ విద్యార్థులకు సమాచారం ఇచ్చింది. దీనిపై బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌ను, శాప్‌ను విద్యార్థులు ఆశ్రయించగా, శాప్ నుంచి సరైన సమాధానం లభించలేదు. అన్ని అవకాశాలు ఉన్నా జన్యూనెస్ సర్టిఫికెట్ల జారీలో శాప్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా నూజివీడుకు చెందిన బి.ప్రభుదీపిక, షేక్ అఫ్రా, బర్రె ప్రణవిలు దాదాపు ఐదు నుంచి పది నేషనల్స్ ఆడినా క్రీడాకారులకు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు పొందలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల 20వ తేదీ నుంచి ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు సంబంధించి స్పోర్ట్స్ కోటా కింద కౌన్సెలింగ్‌ను నిర్వహించవలసి ఉంది. ఇందుకు సంబంధించి ఆర్జీయూకేటీ 20 మందితో ఫైనల్ లిస్ట్ విడుదల చేయడంతో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ క్రీడాకారులు నూజివీడులోని విక్టోరియా టౌన్‌హాల్ గ్రౌండ్‌లో నిరసనకు దిగారు. మంత్రులు నారా లోకేశ్, పార్థసారథి క్రీడాకారులకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి వారికి అడ్మిషన్లు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రైమ్ కార్నర్

ఊరెళితే దోచేశారు..

రూ. 4.5 లక్షల ఆభరణాలు చోరీ

కైకలూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బంధువు చనిపోయారని ఊరెళితే ఇంటిని దోచేసిన ఘటన కైకలూరులో చోటు చేసుకుంది. శుక్రవారం కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న కైకలూరు పట్టణంలోని వెలమపేటకు చెందిన జలగం శివశేషు బంధువు చనిపోయారని తెలియడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో సహా ఊరికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంట్లోని సుమారు రూ.4.5 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు నిర్ధారించుకున్నారు. కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ పి కృష్ణ, ఎస్సై ఆర్ శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఏలూరు నుంచి క్లూస్ టీం రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఛేదించేందుకు బృందాలను ఏర్పాటుచేసినట్టు సీఐ తెలిపారు.

శ్మశాన వాటిక పూడికను అడ్డుకున్న వారిపై కేసు నమోదు

కలిదిండి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్మశాన వాటిక పూడికను అడ్డుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. కాళ్లపాలెంలో ఖాళీగా ఉన్న డ్రైనేజీ భూమిలో గ్రామస్థులందరూ ఐక్యంగా స్మశాన వాటిక పూడిక పనులు చేపట్టారు. దీంతో కైకలూరు మండల రాచపట్నంకు చెందిన పళ్లెం నాగస్వామి, వాసిపల్లి రమేష్, అందుగుల జయకుమార్‌తోపాటు కొంతమంది వ్యక్తులు ఈ స్థలం తమ కుటుంబ సభ్యులందరిదీ అని, పూడ్చటానికి వీలు లేదని పనులను అడ్డుకున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.